




పేదింటికి అదనపు సాయం



నరసరావుపేట లేఅవుట్‌లో పునాదుల స్థాయిలో నిలిచిన ఇళ్లు

- జిల్లాలో 14,106 మందికి మరింత లబ్ధి
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.75.99 కోట్లు విడుదల
- గత ఏడాది డిసెంబరుకి నిర్మాణంలో ఉన్న ఇళ్లకు మాత్రమే..
- నిర్మాణాలు పూర్తి చేసుకోవడంపై లబ్ధిదారులకు అవగాహన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆర్థిక స్థోమత లేక.. ప్రభుత్వం ఇచ్చిన నిధులు చాలక.. వేలాది ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. అటు ఆ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు చేతిలో నగదు లేక.. ఇటు ఉంటున్న ఇళ్లకు అద్దెలు చెల్లించలేక అల్లాడుతున్నారు. వీరి అవస్థలను ప్రభుత్వం గుర్తించింది. లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వైసీపీ హయాంలో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోయిన ఎస్సీ, ఎస్టీ.. బీసీలకు అదనపు నిధులు విడుదల చేయనున్నది. ప్రధానమంత్రి అవాస్ యోజన, జన్మన్ పథకాల కింద చేపట్టి అర్థాంతరంగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాల పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గతేడాది డిసెంబరు 10 నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎస్సీ, బీసీలకు ఇంటికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నది. జిల్లాలోని మొత్తం లబ్ధిదారులకు రూ.75.99 కోట్లు అదనపు సాయంగా అందనున్నది. సీఎం అవాస్ యోజన అర్బన్, రూరల్, పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన ఇళ్లకు రూ.1.80 లక్షలు మంజూరు కాగా ప్రస్తుతం అదనంగా మరికొంత సాయం ప్రభుత్వం నుంచి రానున్నది. జిల్లాలో అదనపు సాయం 14,106 మందికి అందనున్నది. వీరిలో ఎస్సీ లబ్ధిదారులు 5,269 మందికి రూ.26.34 కోట్లు, బీసీలు 6,653 మందికి రూ.33.26 కోట్లు, ఎస్టీలు 2,184 మందికి రూ.16.38 కోట్లు అదనపు సాయాన్ని ప్రభుత్వం అందించేందుకు సిద్ధమైంది. ఈ మొత్తాన్ని ఇంటి నిర్మాణ సమయంలో నాలుగు దశల్లో అందించనున్నారు. ఈ అదనపు సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయంపై లబ్ధిదారులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీ కార్యదర్శులు లబ్ధిదారులను కలసి అదనపు సాయంపై అవగాహన కల్పిస్తున్నారు.

అదనపు సాయం ఇలా..

నియోజకవర్గం	బీసీ	ఎస్సీ	ఎస్టీ	ఇళ్లు	నిధులు (రూ.కోట్లలో)
నరసరావుపేట	1056	439	89	1584	8.14
చిలకలూరిపేట	392	638	129	1159	6.11
గురజాల	707	526	166	1399	7.41
మాచర్ల	1924	740	917	3581	20.19
పెదకూరపాడు	1311	1319	313	2943	15.49
సత్తెనపల్లి	446	824	220	1490	8.00
వినుకొండ	817	783	350	1950	10.62

వెంటాడుతున్న ఇసుక కొరత

పేదల ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత వెంటాడుతోంది. అధికారికంగా రీచ్‌లు నిర్వహించకపోవడంతో ఇసుకకు కొరత ఏర్పడింది. ప్రైవేట్ నిర్మాణాలకు బ్లాక్‌లో ఇసుక లభిస్తుండగా ప్రభుత్వ పథకాలు.. పేదల గృహాలకి మాత్రం ఇసుక అందడంలేదు. జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులకు 8,500 టన్నుల ఇసుక అవసరం ఉందని 20 రోజుల క్రితం గృహ నిర్మాణ శాఖ మైనింగ్ శాఖకు ఇండెంట్ ఇచ్చింది. అయితే నేటి వరకు ఒక్క టన్ను కూడా సరఫరా కాలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నా ఇసుక కొరతతో వారు ఇళ్లను నిర్మించుకునే పరిస్థితి లేదు. ఇసుక సమస్యను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతుండగా ఇప్పట్లో అది పరిష్కారమయ్యే పరిస్థితులు కానరావడంలేదు.

15,968 ఇళ్లే పూర్తి..

జగనన్న కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం ఊదర గొట్టింది. అయితే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో చతికిల పడింది. జిల్లా వ్యాప్తంగా 36 లేఅవుట్‌ల్లో 39,624 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా 15,968 మాత్రమే పూర్తి అయ్యాయి. పునాదుల దశలో 9,285 ఇళ్లు ఉన్నాయంటే పేదలపై గత పాలకుల చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. 14,371 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యం

ఇంటి నిర్మాణాల బిల్లుల చెల్లింపులపై ఇంజనీరింగ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యం లబ్ధిదారులకు శాపంగా మారుతోంది. నిధులు ఉన్నా బిల్లులు చెల్లించలేని పరిస్థితి గృహ నిర్మాణశాఖ ఎదుర్కొంటోంది. ఇంటి నిర్మాణాలకు సంబంధించి వివిధ దశల్లో వ్యయాన్ని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నమోదు చేసి గృహ నిర్మాణ శాఖ అధికారులకు అందజేయాలి. ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో బిల్లులు నిలిచి లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారు.



కొనుగోల్‌మాల్

- గుంటూరులో బయ్యర్ల బినామీ వ్యాపారం
- ఒక్క కేంద్రంలోనే 1.80 లక్షల క్వింటాళ్లు కొనుగోలు
- క్వాలిటీ, స్టాండెడ్ కటింగ్ పేరుతో కోత.. కొందరికి రూ.3 కోట్లు లబ్ధి

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

కొందరు బయ్యర్లు అత్యధికంగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. రైతులకు మేలు చేసేందు కోసం కొనుగోలు చేస్తున్నారని అందరూ అనుకున్నారు. తీరా అసలు విషయం చూస్తే.. ఇదో పెద్ద కొను'గోల్‌మాల్' అని తేలింది. వారి అసలు గోల్ (లక్ష్యం) అర్థమయ్యాక అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. గుంటూరు పరిధిలోని సీసీఐ(కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల్లో భారీ అక్రమాలు చోటు చేసుకు న్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఒకే ఒక్క కేంద్రంలో అధికంగా కొనుగోళ్లు జరిగినట్లు వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. జిన్నింగ్ మిల్లులు యజమానుల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని గాయత్రీ కాటన్ ప్రొడక్ట్స్, శ్రీ సాయి ట్రేడర్స్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పత్తి కొనుగోలుకు ఇద్దరు బయ్యర్లు మారారు. గాయత్రీ కాటన్ ప్రొడక్ట్సులో అతి తక్కువగా 4626.75 క్వింటాళ్లు, శ్రీ సాయి ట్రేడర్స్‌లో 20281 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. అతి తక్కువగా పత్తి కొనుగోలు చేయడం వల్ల యార్డుకు వచ్చిన ఆదాయం కూడా కేవలం రూ.17 లక్షలు మాత్రమే. ఇదే మిల్లులకు అతి సమీపంలో గుంటూరు-ఏ, గంపలగూడెం యార్డులకు చెందిన జిన్నింగ్ మిల్లుల్లో భారీగా కొనుగోలు జరిగింది. ఇక్కడ వేరే వ్యక్తులు మిల్లులు అద్దెకు తీసుకుని జిన్నింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేంద్రాల వెనుక బయ్యర్ల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ జరిగిన పత్తి కొనుగోళ్లు పరిశీలిస్తే ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కేంద్రాలకు ఎంత అన్యాయం జరిగిందో అర్థం అవుతుంది. ఉదాహరణకు గంపలగూడెం యార్డు పరిధిలోకి వచ్చే ఓ మిల్లులో 87448.16 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా, మరో కేంద్రంలో ఏకంగా 1.17 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఒకే ఒక్క కేంద్రంలో సుమారు రూ.86 కోట్ల విలువ చేసే పత్తిని కొన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గుంటూరు -ఏ కేంద్రాల్లో కూడా ఇదే రీతిలో కొనుగోళ్లు జరిగాయి. వాస్తవానికి జనవరి నెలకు పత్తి రావడం పూర్తిగా తగ్గిపోతుంది. అయితే ఆశ్చర్యంగా గుంటూరు- ఏ, గంపలగూడెం కేంద్రాల్లో అన్ సీజన్‌లో కూడా 5 వేల క్వింటాళ్లకు తగ్గకుండా పత్తిని కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

తెర వెనుక ప్రయోజనం వేరు..

కొన్ని సీసీఐ కేంద్రాల్లో పత్తి ఎక్కువగా కొనుగోలు చేయడంలో తెరవెనుక దాగిన ప్రయోజనాలు మాత్రం వేరుగా ఉన్నాయి. ఎక్కడైతే ఎక్కువ పత్తి కొనుగోలు జరిగిందో అక్కడ క్వాలిటీ, స్టాండెడ్ కటింగ్ పేరుతో కోత బాగా విధించారు. ఆయా కేంద్రాల్లో క్వింటాల్‌కు 5 కిలోల నుంచి 7 కిలోల వరకు కోత విధించారు. ఈ లెక్కన ఒక్క బయ్యర్ 1.80 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తే ఎంత మిగులు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలా పక్కకు తీసిన పత్తి జిన్నింగ్ వేయగా వచ్చిన దూదిని విక్రయించారు. ప్రస్తుతం ఆరోపణలు వస్తున్న ఆయా కేంద్రాల్లో కొందరికి సుమారు రూ.3 కోట్ల వరకు అదనపు లాభాలు వచ్చినట్లు ఆరోపణలున్నాయి.

నరసరావుపేట లీగల్, మార్చి 20, (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధన.. కోర్టులో న్యాయస్థానాల్లో సవుర్పించాలన్నారు. అందరూ అన్ని విషయాలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. నరసరావుపేట ట్రాఫిక్ సీఐ లోకనాథం, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అరుణజ్యోతి, నరసరావుపేట మహిళా స్టేషన్ సీఐ సుభాషిణి, డి.ఎస్.బి.ఎస్.ఐ శశికుమార్, ఎస్సీఎస్టీ సీఐ రమేష్‌బాబు తదితరులు శిక్షకులుగా వ్యవహరించారు.

ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


పోలీసు సిబ్బందికి శిక్షణలో ఎస్పీ శ్రీనివాసరావు

ఆధారాల సమర్పణకు పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని మెరుగైన విధి నిర్వహణ కనపరచాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల సవరించిన నూతన క్రిమినల్ చట్టాలపై పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ స్టేషన్‌లోనూ కానిస్టేబుళ్లలోని నైపుణ్యాలు వెలికితీసి, వాటికి మెరుగులు దిద్ది వారి సేవలు వినియోగించుకుంటామన్నారు. తప్పులు చేసిన వారికి శిక్షలు పడాలంటే తగిన ఆధారాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

జడ్పీకి.. బకాయిల భారం
రావాల్సిన అద్దెలు 1.22 కోట్లు
అతిథిగృహాల్లో పేరుకుపోయిన బాకీలు
వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్
8
ఒకటికన్నా మించి
- యార్డులో కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ లైసెన్సులు
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత



- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- గత ఆడిట్‌లో వెలుగుచూసిన అక్రమాలు
- రుణాల పేరిట బ్యాంకు సొమ్ము దారిమళ్లింపు
- రూ.425 కోట్లు గల్లంతు.. మొండిబకాయిలంటున్న అధికారులు
- బ్యాంకు శాఖల్లో అందుబాటులో లేని రుణ గ్రహీతల వివరాలు
- 2022లో సీఐడీ విచారణపై లేఖ.. నాడు అడ్డుకున్న వైసీపీ నేతలు

జీడీసీసీసీపై.. సభా సంఘం

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో గుంటూరు డిస్ట్రిక్ కో-ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంకు(జీడీసీసీ)ను నిలువునా దోచేశారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బ్యాంకు సొమ్ము అందిన కాడికి కాజేశారు. అధికారం అండ.. పాలకవర్గం, అధికారుల సహకారంతో అక్రమార్కులు చెలరేగిపోయారు. ఆయా అక్రమాలను గుర్తించినా విచారణలకు అక్రమార్కులు అడ్డుతగులుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో నాడు అధికారాన్ని అడ్డంపెట్టుకుని జీడీసీసీబీని అడ్డంగా దోచేసిన అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జీడీసీసీబీ అక్రమాలపై సభా సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. దీంతో జీడీసీసీబీలో గత ఐదేళ్లలో అక్రమాలకు పాల్పడిన రాజకీయ నేతలు, అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జీడీసీసీబీలో జరిగిన ఎన్నో అక్రమాలు గత ఆడిట్ నివేదికలోనే వెలుగుచూశాయి. జీడీసీసీ అక్రమాలపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఫిర్యాదుతో ప్రభుత్వం సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా సహకార శాఖ అధికారిని నియమించారు. ఈ విచారణపై కూడా అందరూ పెదవి విరిచారు. దాని వల్ల అక్రమాలు బయటకు రావని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సభా సంఘం ఏర్పాటుకు అడుగు పడింది. కొందరు వైసీపీ నేతలు బినామీలు, నకిలీలను అడ్డంపెట్టుకుని రుణాల పేరట జీడీసీసీ, సహకార సంఘాల్లో వందల కోట్లు దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం సభా సంఘం వేయడంతో అక్రమార్కులపై ఈ సారి తప్పకుండా చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎన్నెన్నో అక్రమాలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 జీడీసీసీ బ్యాంకు శాఖలు, 167 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు రూ.425 కోట్లు గల్లంతైనట్లు గత ఆడిట్‌లో నిర్ధారించారు. అధికారులు వీటిని మొండిబకాయిలు అని చెబుతున్నారు. అయితే ఆయా రుణ గ్రహీతల వివరాలు బ్యాంకులో అందుబాటులో లేకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. గుంటూరు పరిసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజ్‌లు, ఇతర వ్యాపార సంస్థలను అడ్డంపెట్టుకుని రుణాల పేరిట నాటి అధికార పార్టీ నేతలు బ్యాంకు సొమ్ము దారిమళ్లించారని తెలుస్తోంది. జీడీసీసీ బ్యాంకుతో పాటు, సహకార సంఘాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు 2022లోనే అధికారులు గుర్తించారు. అప్పుడే ఓ అధికారి ఆయా అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు సమాచారం. అయితే ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన ప్రముఖ నేతలు సీఐడీ విచారణకు అడ్డుతగిలినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం మారిన తర్వాత జీడీసీసీ వేదికగా సాగిన నకిలీ రుణాల బాగోతాలు అనేకం వెలుగులోకి వచ్చాయి.

గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, నల్లపాడు, రెడ్డిపాలెం, గోరంట్ల, కాకుమాను, పెదనందిపాడు, పల్నాడు జిల్లాలోని గురజాల తదితర ప్రాంతాల్లో ఒకరి పేరుతో వేరొకరు రుణాలు పొందినట్లు వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నకిలీ సభ్యుల పేరిట రూ.10.68 కోట్లు రుణాల రూపేణా దారిమళ్లించినట్లు తేలింది. 17 సహకార సంఘాల్లో 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో ఈ తంతు కొనసాగింది. రెడ్డిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాల మంజూరు పేరట జరిగిన అక్రమాలపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, డివిజనల్ సహకార అధికారి విచారణ జరిపారు. ఇక్కడ కమిటీ అనుమతి లేకుండానే 55 మంది నకిలీలను సభ్యులుగా చేర్చుకుని వారిలో 50 మందికి సీసీ, కేసీసీ రుణాలు రూ.2.99 కోట్లు మంజూరు చేశారు. మాచవరం మండలంలోనూ ఇదేవిధంగా జరిగింది. ఈ అక్రమాల్లో జీడీసీసీ బ్యాంకు అధికారులు, సహకార సంఘాల్లోని సిబ్బంది పాత్ర కూడా ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో జీడీసీసీబీకి చెందిన 9 మంది మేనేజర్లు, ఆరుగురు అసిస్టెంట్ మేనేజర్లు, ఓ క్యాషియర్, ఐదుగురు సూపర్‌వైజర్లు, మరికొందరు రెవెన్యూ అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో బాధ్యులైన అధికారులు సివిల్, క్రిమినల్ చర్యలు నిలువరించాలని కోరుతూ చేసిన విజ్ఞప్తిని హైకోర్టు కొట్టివేసింది.



మొక్కలు లేక వెలవెలబోతున్న నగరవనం

నగరవనం.. ఏది?

- లక్ష్యానికి దూరంగా నగరవనం అభివృద్ధి
- రూ.1.60 కోట్లు ఖర్చు.. అసంపూర్తిగానే పనులు
- పచ్చదనం.. ఆహ్లాదం లేకుండానే టిక్కెట్ల వసూళ్లు

మాచర్లటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హడావుడి జీవనం.. దొరకని ప్రశాంతత.. ఆహ్లాదం లేని కాలనీలు.. ఆటస్థలాలకు దూరమైన చిన్నారులు, యువకులు.. ఇదీ పట్టణ ప్రజానీకం సాగిస్తున్న జీవనం. వీటిని అధిగమించి.. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు నగరవనాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పలు పట్టణాల్లో నగరవనాలు ఏర్పాటు చేశాయి. ఇందులో భాగంగా మాచర్ల పట్టణంలోని మాచర్ల - శ్రీశైలం రహదారిని ఆనుకుని అటవీ శాఖ పరిధిలోని 50 ఎకరాల విస్తీర్ణంలో నగరవనం ఏర్పాటుకు రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. అయితే ఇందులో రూ.1.60 కోట్లతో కంపచెట్ల తొలగింపు, నీటి నిల్వ కోసం కుంటలు, 3.4 కి.మీ వాకింగ్ ట్రాక్, ట్రాక్ చుట్టూ ఇనుప జాలి, బోర్‌వెల్, విద్యుత్ సదుపాయం, సోలార్ లైట్లు, మినరల్ వాటర్ ప్లాంట్, చిల్డ్రన్ పార్కు, యోగా సెంటర్, టాయిలెట్స్, సందర్శకులు సేదతీరేందుకు పాకలు, ప్రత్యేక క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. పచ్చదనం, పూలమొక్కలు, ఔషధవనం, ధ్వజస్తంభాలు, ముఖద్వారం, గేటు ఏర్పాటు కోసం సుమారు రూ.40 లక్షలు మంజూరు కాలేదు. దీంతో నగరవనం లక్ష్యం రెండేళ్లు గడిచినా నెరవేరలేదు. పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, ఇతర సౌకర్యాలు సరిగా లేకపోవడంతో పట్టణ ప్రజలు నగరవనంలో పర్యటించేందుకు విముఖత చూపుతున్నారు. దీనికితోడు మొక్కలకు నీరందించాలంటే ఉన్న బోరు నీరు సరిపోయే పరిస్థితి లేదు. మిగిలిన సదుపాయాలు ఏర్పాటు చేయకుండానే సందర్శకుల వద్ద ప్రవేశ రుసుము వసూలు చేయడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నగరవనం అనగానే ఉద్యాన వనాలు, గ్రీనరీ, వాకర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణం తోపాటు ఆక్సిజన్ అందించే మొక్కలు ఏర్పాటు చేయాలి. కానీ అవేవీ లేకపోవడంతో వాకర్స్ కూడా నగరవనం వైపు మొగ్గు చూపడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిగిలిన నిధులను త్వరితగతిన మంజూరు చేస్తే పనులు పూర్తయి ప్రజలకు ఆహ్లాదం లభిస్తుంది.

నిధులు కోసం ఎదురుచూపు

మాచర్ల నగరవనానికి రూ.2 కోట్లు కేటాయించగా ఇంకా రూ.40 లక్షలు విడుదల కావాల్సి ఉంది. ఈ నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. నిధులు అందగానే మరో బోరు ఏర్పాటు చేసి నీటి కొరత లేకుండా మొక్కల పెంపకంతోపాటు వనాలు, గ్రీనరీ, పెండింగ్ పనులు పూర్తి చేస్తాం. పూర్తిస్థాయిలో పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన నగరవరం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-ఎస్ విజయలక్ష్మి, ఫారెస్ట్ రేంజర్

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.24 (శుక్రవారం ఉదయం)
సహారి : 4.55 (శనివారం ఉదయం)



చిల్డ్రన్ పార్క్



నీటి నిల్వల కోసం ఏర్పాటు చేసిన కుంట

ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గుంటూరు జిల్లాలో 4.95 లక్షల మంది ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 5 నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన వారు 2.07 లక్షలు మంది ఉండగా, 15 సంవత్సరాలు పైబడిన వారు 2.88 లక్షల మంది ఉన్నట్లు సమాచారం. 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన 9400 మంది పిల్లలకు ఇంతవరకు అసలు ఆధార్ కార్డు లేనట్టు తెలుస్తుంది. వారిలో 6758 మంది పిల్లలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉండి కూడా ఆధార్ కార్డులు పొందక పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో నూతన ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు, ఉన్నవాటిని అప్‌డేట్ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తెలిపారు. ప్రస్తుతం ఆరంభమయిన ఆధార్ కేంద్రాల్లో ఈ నెల 22వ తేదీ వరకు మొదటి విడత, 25 నుంచి 28వ తేదీ వరకు రెండో విడత వరకు ప్రజలకు అవసరం అయిన సేవలు అందిస్తారని తెలిపారు. ప్రతి మండలంలో మూడు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్ సేవల కోసం జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాలు పని చేస్తున్నాయని ఆయన తెలిపారు.

మార్చి నెల జీతాలు 28వ తేదీనే జమచేయాలి

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల చివరి లో రంజాన్, ఉగాది వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నందున జీతాలు 28వ తేదీనే జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ 28వ తేదీన జీతాలు జమ చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులంతా సంతోషంగా పండుగ నాచరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉగాది కానుకగా ఉద్యోగులకు రావాల్సిన డీఏ మంజూరు చేయాలని, తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలని, 12వ పే రివిజన్ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దుకాణాల వేలం ద్వారా రూ.54 లక్షల ఆదాయం

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో వివిధ దుకాణాల లీజుకు సంబంధించి గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగిన బహిరంగ వేలంలో రూ. 54.22 లక్షల ఆదాయం లభించింది. గత సంవత్సరం కంటే ఇప్పుడు జరిగిన వేలంలో రూ. 4.78 లక్షల అధిక ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి పి.సునీల్‌కుమార్ తెలిపారు. కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు అమ్ముకునేందుకు రూ.17.20లక్షలు, వాహనాల పార్కింగ్‌కు రూ.10.61లక్షలు, బొమ్మలు అమ్ముకునేందుకు రూ.3.90లక్షలు, నదీతీరంలో కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.9.09లక్షలు, చెప్పులు భద్రపరుచుకునేందుకు రూ.2.66లక్షలు, తల నీలాలు పోగుచేసుకునేందుకు రూ.20వేలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునేందుకు రూ.9.51లక్షలు, మొదటి ప్రాకారంలో కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.లక్షా 5 వేలు వేలం పాట ద్వారా ఆదాయం లభించింది. వేలం పాటను పెదకూరపాడు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణరెడ్డి పర్యవేక్షించారు.



వేములూరిపాడులో భూములను పరిశీలిస్తున్న జేసీ భార్గవ్ తేజ

వినుకొండ-గుంటూరు హైవే విస్తరణకు...

భూములను పరిశీలించిన జేసి భార్గవ తేజ

మేడికొండూరు, ఫిరంగిపురం మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వినుకొండ-గుంటూరు జాతీయ రహదారి 554డి నాలుగు లైన్లగా విస్తరించే పనులు ఊపందుకున్నాయి. అందులో భాగంగా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు భూసేకరణ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ తేజ మేడికొండూరు, ఫిరంగిపురం మండ లాలలో రహదారి విస్తరణకు అవసరమైన భూములను గురువారం పరిశీలించారు. మేడికొండూరు మండలంలోని డోకిపర్రు, మంగళగిరిపాడు, మేడికొండూరు, ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడు, మేరికపూడి, నుదురుపాడు, వేమవరం, రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్ గ్రామాలలోని సర్వే నంబర్లను, భూములను స్వరూపాన్ని ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల పరిధిలో భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో ఆయన మాట్లాడారు. రహదారుల అభివృద్ధి నిమిత్తం భూములు అవసరమవుతున్నందున రైతులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు, ఫిరంగిపురం తహసీల్దార్లు ఎం. హరిబాబు, జే ప్రసాదరావు, సర్వేయర్లు కె. సాంబశివరావు, వెంకటేశ్వర్లు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీరివ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని



అసెంబ్లీలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడికాలువ పరిధిలో గుర జాల నియోజకవర్గంలోని అన్ని మేజర్లు, మైనర్ కాల్వలకు వారబందీ పెట్టడం వల్ల నీటి విడుదల నిలిపివేయడం, తగ్గించడంతో మిర్చి పంటలు దెబ్బతింటు న్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం అసెంబ్లీ లో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్క కాలువ కూడా బాగు చేయకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన తాను తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన రెండు నెలల్లో నియోజకవర్గపరిధిలోని అన్ని మేజర్లు, మైనర్ కాల్వలను బాగు చేయించామని యరపతినేని తెలిపారు. నీటి విడుదల తగ్గించ డం, నిలిపివేయడం వల్ల చివరి భూముల్లో సాగుచేస్తున్న మిర్చి, వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. వేసవి కాలం వచ్చినందున గ్రామ, పట్టణ పరిధిలోని చెరువులు, కుంటలను నీటితో నింపి వేసవిలో తాగు నీరు ఎద్దడి లేకుండా గ్రామ, పట్టణ స్థాయి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు ఏప్రిల్ నెలాఖరు వరకు సాగర్‌నీరు నిరాటంకంగా విడుదల చేయాలని కోరారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో..

మహిళా ఉద్యోగి హత్య

పిడుగురాళ్ల మార్చి 20 (ఆంధ్రజ్యోతి). డబ్బులు విషయంలో మాటా మాటా పెరిగి మహిళా ఉద్యోగిపై చేయి చేసుకోవడంతో తల బలంగా గోడకు తగిలి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలో జరిగింది. పిడుగురాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లాకు చెందిన సీతారత్నం(57) ఏఎన్‌ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై మాచవరం పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చింది. అదే పీహెచ్‌సీలో సత్తెనపల్లికి చెందిన ఎం శ్రీనివాసరావు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం వుంది. ఈ నేపథ్యంలో బ్రాహ్మణపల్లిలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్న సీతారత్నం ఇంటికి శ్రీనివాసరావు వచ్చి వెళుతూ వుండేవాడు. గురువారం రాత్రి డబ్బులు విషయంలోనే, మరో విషయంలోనూ ఇద్దరి మధ్య మాట పెరిగి వాగ్వాదం జరిగింది. ఆ కోపంలో శ్రీనివాసరావు, సీతారత్నాన్ని బలంగా గోడకేసి కొట్టడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. చుట్టుపక్కల వారు ఘటనాస్థలానికి చేరుకుని శ్రీనివాసరావును గదిలో పెట్టి బంధించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మోహన్ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 519.00 అడుగులు ఉంది. ఇది 147.45 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7190 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,023 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకాలను తక్షణమే పునరుద్ధరించండి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అసెంబ్లీలో కోరారు. ఆ కాల్వపై 200 లకు పైగా ఎత్తిపోతల పథకాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయకట్టు స్థిరీకరణ, కాల్వల ఆధునికీకరణ అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన సాగు, తాగునీటి సమస్యలపై ప్రభుత్వ వివరణ అడిగారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా రూ.6 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన హరిశ్చంద్రాపురం, నకరికల్లు ప్రాజెక్ట్ కి టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్ల ను కూడా ఎంపిక చేసిందని ఆన్నారు. ఆ ప్రాజెక్ట్ లో గత ప్రభుత్వం రూపాయి పనిచేయలేదని, ఆప్రాజెక్ట్ ను ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలని పుల్లారావు సభాముఖంగా ప్రశ్నించారు. హరిశ్చంద్రాపురం-నకరికల్లు ప్రాజెక్ట్ ను బనకచర్లలో విలీనం చేసే ఆలోచన ఉందా అని కూడా ప్రశ్నించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీ.సందీప్, వై.సుజిత్‌కుమార్

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

తాడికొండ(లాం)మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవడం వలన ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చునని పీపుల్ సొల్యూషన్స్, కాన్సంట్రిక్స్ క్యాటలిస్ట్ సీనియర్ మేనేజర్ డీ.సందీప్ తెలిపారు. లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న చలపతి మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఉండే మెళుకువలు నేర్చుకోవడం వలన ఉన్నత స్థాయికి వెళ్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్నికల్ ఈవెంట్స్‌లో 16 కళాశాలల నుంచి 67 బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. అమరావతి విట్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి, కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. పేపర్ ప్రెజెంటేషన్‌లో ఒంగోలు క్విస్ కళాశాలకు చెందిన టీ.శిరీష ప్రథమ బహుమతి, ఆర్జేయుకేటికి చెందిన పీ.చైతన్య ద్వితీయ బహుమతి పొందారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో ఆర్జేయుకేటీకి చెందిన పీ.చైతన్య ప్రథమ, క్విస్ కళాశాలకు చెందిన ఎస్.కే. షమీ ద్వితీయ స్థానం పొందారు. ప్రాజెక్ట్ ఎక్స్ షోలో చలపతి కళాశాల విద్యార్థి కే.రూపేష్ ప్రథమ, క్విస్ కాలేజీ విద్యార్థి గోవిందరాజు ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. టెక్నికల్ క్విజ్‌లో చలపతి కళాశాలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి. కోడింగ్ చాలెంజ్‌లో చలపతి కళాశాలకు చెందిన జ్యోతి మణికంఠ, కే. తసీంలు ప్రథమ, దిత్వీయ స్థానాలు సాధించారు. లోగో డిజైన్‌లో చలపతి కళాశాల విద్యార్థి ఎల్ అనిత ప్రథమ, విజయవాడ ఎన్నారై కళాశాల విద్యార్థి సాయి యోగేష్ ద్వితీయ బహుమతి సాధించారు. సర్క్యూట్ డి బగ్గింగ్ అండ్ ఫజిల్‌లో విజ్ఞాన లారా కళాశాల విద్యార్థి కే. యామిని, చలపతి కళాశాల విద్యార్థి తిరుమలరావుకు బహుమతులు లభించాయి. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వై.వీ.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

1.5 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ఆరుడొంకల బావి సమీపంలోని పాత కోళ్లఫారం షెడ్‌లో 1.5 కేజీల గంజాయిని సత్తెనపల్లి డీఎస్‌పీ స్పెషల్ టీం గురువారం స్వాధీనం చేసుకున్నారు. అమరావతిలో గంజాయి వ్యాపారం జోరుగా సాగుతుందన్న సమాచారంతో తనిఖీలు చేస్తున్న టీంకు షెడ్‌లో నలుగురు అనుమానాస్పదంగా గంజాయి పొట్లాలు కట్టడం గమనించి వారి వద్దకు వెళ్లే లోపు నలుగురు నిందితులు పరారయ్యారు. ఆ ప్రదేశంలో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు వదిలి వెళ్లిన బైక్‌ను గుర్తించి దాని ద్వారా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07230 చర్లపల్లి - కన్యాకుమారి ప్రత్యేక రైలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 25వ తేదీ వరకు ప్రతీ బుధవారం రాత్రి 9.50కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి మీదగా అర్ధరాత్రి దాటాక 2.30కి గుంటూరు, రేణిగుంట, తిరువణ్ణామలై, చిదంబరం, కుంభకోణం, తంజావూరు, కొడైకెనాల్ రోడ్డు, మధురై మీదగా గురువారం అర్ధరాత్రి దాటాక శుక్రవారం ప్రారంభ సమయం(వేకువజామును ముందు) 2.30 గంటలకు కన్యాకుమారి చేరుకొంటుంది. నంబరు. 07229 కన్యాకుమారి - చర్లపల్లి ప్రత్యేక రైలు ఏప్రిల్ 4వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం వేకువజామున 5.15 గంటలకు బయలుదేరి శనివారం వేకువజామున 4.50కి గుంటూరు, 5.44కి సత్తెనపల్లి, ఉదయం 6.04కి నడికుడి, ఉదయం 11.40కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బీసీ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు డీఎస్సీకి ఆన్ లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎ భవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు టెట్ పాస్ అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పదవ తరగతి, బీ ఈడీ లేదా టీసీసీ మార్కుల జాబితా, టెట్ మార్కుల జాబితా, కుల, ఆదాయ, ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో రాజా గారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్లో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థుల తల్లిదండ్రులు ఆదాయం రూ. లక్ష లోపు ఉండాలని సూచించారు. ఇతర వివరాలు కోసం 0863-2358071 లో సంప్రదించాలని సూచించారు.

న్యాయవాదుల క్రికెట్ టోర్నీ విజేత గుంటూరు జట్టు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఒకటవ అదనపు జిల్లా జడ్జి సత్యవతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్‌బాబు

గుంటూరు(లీగల్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో గుంటూరు చంద్రశేఖర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు గురువారం సాయంత్రం ఒకటవ అదనపు జిల్లా జడ్జి వి ఏ ఎల్ సత్యవతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్ బాబులు ట్రోఫీలను అందజేశారు. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు న్యాయవాదుల జట్టుతో నరసరావుపేట న్యాయవాదుల జట్టు తలపడింది. తొలుత టాస్ గెలిచిన నరసరావుపేట జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు న్యాయవాదుల జట్టుకు ఓపెనర్లు అంచుల రామాంజనేయులు (47 బంతుల్లో 59 పరుగులు) మహమ్మద్ మాజ్ (27 బంతుల్లో 48 పరుగులు) తమ నిలకడైన బ్యాటింగ్‌తో మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన జట్టు కెప్టెన్ చంద్ర శేఖర్ రెడ్డి (26 బంతుల్లో 65 పరుగులు) సాజిద్ (20 బంతుల్లో 30పరుగులు) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో గుంటూరు న్యాయవాదుల జట్టు 20 ఓవర్లలో మూడు వికెట్లకు 221 పరుగులు చేసింది. నరసరావుపేట జట్టులోని ఖాదర్, కిరణ్, సూర్యలకు ఒక్కో వికెట్ లభించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నరసరావుపేట జట్టు 17.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయింది. సాజిద్ 3.3 ఓవర్లు బౌలింగ్ చేసి ఐదు వికెట్లు కూల్చాడు. నరసరావుపేట జట్టులో అధికంగా యశ్వంత్ 20 పరుగులు రవి 44 పరుగులు సంజీవ్ 17 పరుగులు మధు 32 పరుగులు చేశారు. బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసి బ్యాటింగ్‌లో 30 పరుగులు సాధించిన గుంటూరు న్యాయవాదుల జట్టు ప్లేయర్ సాజిద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

పరీక్షల కోసం రోగి.. విశ్రాంతిలో ఉద్యోగి



వైద్యపరీక్షలకోసం రేడియాలజీ విభాగం వద్ద ఎదురు చూస్తున్న రోగి



మరమ్మతులకు గురైన సిటీస్కాన్ పరికరంపై నిద్రిస్తున్న ఉద్యోగి

తెనాలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో అత్యవసర విభాగానికి 24 గంటలు వైద్యసేవలకు రోగులు వస్తుంటారు. వారిని వైద్యులు పరీక్షలు చేసి రోగనిర్ధారణకు అవసరమైన స్కానింగ్‌లు, రక్త పరీక్షలు వంటివాటికి పంపుతుంటారు. ఆ రిపోర్టుల ఆధారంగా వైద్యం అందించాల్సి ఉంటుంది. దీంతో రోగుల సహాయకులు వైద్యుల సూచనల మేరకు పరీక్షలు చేయించుకునేందుకు రేడియాలజీ విభాగానికి వస్తుంటారు. అత్యవసర విభాగం నుంచి వచ్చే రోగులకు 24 గంటలు అవసరమైన పరీక్షలు జరిపేలా సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. గురువారం వైద్యశాల్లో ఊపిరాడక ఇబ్బందులు పడుతూ వచ్చిన ఓ రోగికి రేడియాలజీ విభాగంలో పరీక్షలు, అనంతరం రక్తపరీక్షలు చేయించుకురావాలని వైద్యులు సూచించారు. ఆయా విభాగాల్లో రేడియాలజీ విభాగానికి పరీక్షలకు వెళితే సిబ్బంది వైద్యసిబ్బంది కనిపించలేదు. అత్యవసర వైద్యం కావడంతో వారి కోసం రోగి బంధువులు పలువురిని వాకబు చేశారు. ఈ క్రమంలో భోజనానికి వెళ్లారని చెప్పడంతో వారి కోసం పడిగాపులు తప్పలేదు. ఇదే క్రమంలో పక్కనే ఉన్న సిటీస్కానర్ గదిలో ఏసీ ఆన్ చేసుకుని ఆ విభాగానికి చెందిన ఓ ఉద్యోగి నిద్రపోవడం చూసి రోగిబంధువులు విస్మయానికి గురయ్యారు.

సాంకేతికతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

పెదకాకాని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికతను జోడించి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ



సదస్సులో ప్రసంగిస్తున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు.

కార్యక్రమానికి ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనలు సమాజానికి ప్రయోజనకరంగా మారాలని తెలిపారు. నూతన విద్యా విధానం వల్ల విద్యా రంగంలో సంస్కరణలు రావడంతో పాటు, కొన్ని సవాళ్లు కూడా ఎదురుకోవాల్సి వస్తుందని చెప్పారు. దేశంలోకి ప్రైవేట్ యూనివర్సిటీల రాకతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో పరిశోధన ఇతర అంశాలను పటిష్ట పరచి విద్యార్థులను ఆకర్షించే విధంగా అడుగులు వేయాలని సూచించారు.

వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర రోజురోజుకూ పెరుగుతుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు, పరిశోధకులు దృష్టి సారిస్తేనే ఉత్తమ ఫలితాలను పొందవచ్చన్నారు. వర్సిటీ రెక్టర్ ఆచార్య కే. రత్నషీలామణి, వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, జాతీయ సదస్సు డైరెక్టర్ ఆచార్య చేబ్రోలు లింగరాజు తదితరులు ప్రసంగించారు.

వైసీపీ నేత అరెస్టు

ఈపూరు, మార్చి20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ మాట్లాడినందుకు మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామ వైసీపీ నాయకుడు కొండవర్లు నాగేశ్వరరావును గురువారం పోలీసులు అరెస్టు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు బాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు నాగేశ్వరరావును అరెస్టు చేసి విచారించి స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

1,48,601 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,42,015 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,48,601 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 60,317 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11000	12500
334	9500	13500	బంగారం	---	---
నంబరు. 5	10000	13500	బ్యాడిగి 355	10000	13500
273	---	----	సింజెంటా		
341	10500	14500	బ్యాడిగి 5531	10000	11700
4884	10000	12000	దేవనూరు డీలక్స్	11000	13300
సూపర్ 10	--	--	ఆర్మూరు	10000	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

నెమలికల్లులో రేపు ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి) మండలపరిధిలోని నెమలికల్లు గ్రామంలో గ్రామతెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని శనివారం ఉదయం ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము, చీరాల ఎమ్మెల్యే ఎం మాల కొండయ్య, టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్ నర్సిరెడ్డి, భాష్యం నవీన్ హాజరవుతారని స్థానిక నాయకులు తెలిపారు.

పీ-4 సర్వేపై గ్రామసభలు

పిడుగురాళ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పీ-4 సర్వేపై నేటి నుంచి వార్డు సభలు నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 21వ తేదీన 5 సచివాలయాలు కలిపి గాంధీనగర్ సచివాలయంలో, 22న చెరువుకట్ట బజారులోని వాటర్ ట్యాంక్ వద్ద, 24న ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద సభలు నిర్వహిస్తారని, మున్సిపల్, సచివాలయ సిబ్బంది అన్ని వార్డుల ఇన్‌చార్జ్‌ల సమక్షంలో వార్డు సభలు నిర్వహిస్తారని కమిషనర్ తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

కారంపూడి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు పలు సామాజిక వర్గీయులకు శాశ్వత శ్మశానం ఏర్పాటుకు 30 సెంట్ల కేటాయించారు. ఎరుకల సామాజిక వర్గీయులకు 10 సెంట్లు, బుడబుక్కల సామాజిక వర్గీయులకు 8 సెంట్లు, మాలలకు 8 సెంట్లు, కుమ్మరులకు 2 సెంట్లు, కంసాలీలకు 2 సెంట్లు చొప్పున కేటాయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను గురువారం పంచాయతీ కార్యాలయంలో ఆయా సామాజిక వర్గీయులకు గంగానపల్లి పుష్పలత శివరామ్, టీడీపీ నేత పుల్లయ్య, అధికారులు అందించారు. ఆయా సామాజిక వర్గీయులు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుష్ వైద్య శిబిరం

బెల్లంకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆయుష్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేసవి కాలంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ఆహారం గురించి వివరించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెదబాబు, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఉషారాణి, ప్రసాదు పాల్గొన్నారు.

బెల్లం వ్యాపారులతో సమావేశం


అచ్చంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాటు సారా నిర్మూలనలో భాగంగా గురువారం బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ తులసీ తెలిపారు. ఎవరైనా వ్యాపారులు సారాకు ఉపయోగించే బెల్లాన్ని అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు చేపడతామని, 15 రోజులకు ఒక సారి బెల్లం కొనుగోలుదారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా నల్లబెల్లం అమ్మినట్లయితే ఎక్సైజ్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. అనంతరం మండలంలోని వైన్ షాపులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

పది పరీక్ష కేంద్రంలో లీకేజీలు..!

● ఎంఈవోకు ఫిర్యాదు

గురజాలటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. కాగా ఇన్విజిలేటర్లకు పట్టణంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థ యాజమాన్యం లంచం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుధవారం హిందీ పరీక్షలో మండలంలోని పల్లెగుంత గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో మాడుగుల గురుకుల పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు గురజాల పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన విద్యార్థులకు ప్రశ్న పత్రం వచ్చిన గంట తరువాత పరీక్ష కేంద్రంలో వాళ్ల స్కూల్ విద్యార్థులకు జవాబులు అందించారు. మిగతా విద్యార్థులు తమ విద్యాసంస్థల యజమాన్యాలకు తెలిపారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఎంఈవో సాంబశివరావుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇన్విజిలేటర్లకు లంచాలిస్తున్న ఓ ప్రైవేటు విద్యాసంస్థ ఆ విద్యా సంస్థలో గురజాల పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు భాగస్వామ్యం ఉండడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రుల, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు కోరుతున్నారు.

విద్యుత్ ప్రాజెక్టు భద్రతే లక్ష్యంగా పనిచేయాలి : ఎస్ఈ



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న ఎస్ఈ వెంకటరమణ

రెంటచింతల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రాజెక్టు భద్రతే లక్ష్యంగా పనిచేయాలని రేయింబవళ్లు ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉండాలని సత్రశాలలో నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ కే వెంకటరమణ కోరారు. గురువారం పవర్ హౌస్ సమీపంలో నూతనంగా నిర్మించిన పోలీసు చెక్‌పోస్టును ప్రారంభించారు.ఈ చెక్ పోస్టులో ఉండే సిబ్బంది సందర్శకుల రాకపోకలను తప్పనిసరిగా పూర్తి చిరునామాతో రికార్డులో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్పీఎఫ్(స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) సిబ్బంది 17 మంది, జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది ఆంధ్రా వైపు పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాసరావు, ఈఈ సుబ్రహ్మణ్యం, నాగరాజు, ఏడీఈ రత్తయ్య, సుబ్బారావు, జీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా నాగమ్మ చెరువు

● ఫిల్టర్ బెడ్‌లలో చెత్తాచెదారం.. పాచిపట్టిన నీరు
● చెరువులో పెరిగిన జమ్ము, కంపచెట్లు
● పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



ఫిల్టర్ బెడ్‌లో పాచి పట్టి రంగుమారిన నీరు



జమ్ముతో నిండి పోయిన నాగమ్మ చెరువు

బెల్లంకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాల మధ్య నాగమ్మ చెరువు ఉంది. ఈ చెరువు ద్వారా రాజుపాలెం, బెల్లంకొండ, క్రోసూరు మండలాల్లోని 18 గ్రామాలకు మంచి నీరు సరఫరా చేస్తున్నారు. కానీ చెరువు అధ్వానంగా తయారైనా ఫిల్టర్ బెడ్‌లలో చెత్తాచెదారం నిండిపోయినా పట్టించుకొనే నాధుడే లేడని ప్రజలు ఆరోపిస్తున్నారు. అప్పటి మంత్రి, ప్రస్తుతం సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చొరవతో మండలంలో నాగమ్మ చెరువు ద్వారా 18 గ్రామాలకు మంచి నీటి సరఫరా చేసేందుకు స్కీమ్‌ను ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సక్రమంగా పని చేయకపోవటంతో ఫిల్టర్ బెడ్‌లలో చెత్తాచెదారం చేరి నీరు పాచిపట్టి ఉన్నాయి. నాగమ్మ చెరువు స్కీమ్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇంతవరకు చెరువులో అభివృద్ధి పనులు చేయలేదు. చెరువు నిండా కంప చెట్లు, జమ్ము చెట్లు పెరిగి, కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నా పట్టించుకొనే అధికారులు లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా ఈ చెరువు ద్వారా పులిచింతల ప్రాజెక్టు ముంపు బాధితులు, ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ నిర్వాసితులకు మంచి నీరు సరఫరా చేస్తున్నారు. జంబో స్కీమ్‌ను ఏర్పాటు చేసి నిర్వాసితులకు మంచి నీరు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. నీటి సరఫరా సక్రమంగా లేకపోవటంతో ముంపు బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాచిపట్టిన నీటిని తాగే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. నీరు రంగు మారినా బ్లీచింగ్ చల్లటంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. గత వైసీపీ పాలనలో పాచి పట్టిన నీరే ఇచ్చారని వాపోతున్నారు. చెరువును శుభ్రం చేసి 18 గ్రామాలకు మంచి నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

15 నెలలుగా జీతాలు లేవు

ఆర్‌బ్ల్యూఎస్ స్కీమ్‌లో పని చేస్తున్న సిబ్బందికి 15 నెలలుగా జీతాలు రావటం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ స్కీమ్‌లో పని చేసిన సిబ్బంది జీతాలు సక్రమంగా రాకపోవటంతో కొంతమంది మానివేశారని, 11 మంది మాత్రమే పని చేస్తున్నారని, సక్రమంగా జీతాలు రాక, ఇళ్లు గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది చెప్పారు. ఎమ్మెల్యే ప్రవీణ్ స్పందించి చెరువులో పని చేస్తున్న సిబ్బందికి జీతాలు ఇప్పించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఏఈని వివరణ కోరగా అందు బాటులో లేరు.

భట్రుపాలెం గ్రామస్థులతో అటవీశాఖ అధికారులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

దాచేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఏళ్ళ తరబడి మాదిన పాడు రిజర్వ్ ఫారెస్టులో ఉండి అభివృద్ధికి అటవీ చట్టాలు అడ్డుగా ఉండటంతో తమ గ్రామాన్ని అటవీ హక్కుల చట్టాల నుంచి తొలగించాలని గ్రామస్థుల నుంచి డిమాండ్ రావటంతో వారి సమస్యలను తెలుసుకొనేందుకు అటవీశాఖ అధికారులు గురువారం భట్రుపాలెం గ్రామాన్ని సందర్శించారు. భట్రుపాలెంలో 12వ శతాబ్దం నుంచే గ్రామంలో దేవాలయాలు, దిగుడు బావులు నిర్మాణాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన శిలాశాసనాలు కూడా ఉన్నాయి. కాగా అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా గ్రామస్థులు హక్కుల చట్టాల నిబంధనల మధ్య తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో గ్రామస్థులు 150 సంవత్సరాలుగా తమ గ్రామాన్ని అటవీ హక్కుల చట్టం నుంచి తప్పించి గ్రామకంఠంగా ఏర్పాటు చేయాలని చేస్తున్న డిమాండ్ నేటికీ నెరవేర లేదు. ఈ నేపథ్యంలో గ్రామస్థులంతా అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి తమ సమస్యలను తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాలతో అటవీశాఖ అధికారులు వాస్తవాలను సేకరించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకొనేందుకు అటవీశాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయకుమారి, డీఆర్‌వో విజయలక్ష్మి, ఏబీవో మనోజ్‌కుమార్‌లు గ్రామస్థులతో కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన ఎఫ్‌ఆర్‌సీ చైర్మన్ బాణావత్ నరసింహానాయక్, హరినాయక్, ధన్‌సింగ్‌నాయక్, బాణావత్ బబ్లునాయక్, భూక్యా శంకర్ నాయక్, కేలావత్ మల్లేశ్వరనాయక్, భూక్యా వెంకటేశ్వర్లు నాయక్, మూడావత్ కోమ్లా నాయక్, తదితరులు అధికారులను కలసి తమ ఇబ్బందులను తెలిపారు. గ్రామస్థుల నుంచి అధికారులు తగు సమాచారాన్ని తెలుసుకొని రికార్డులో నమోదు చేసుకున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమం మరో వారం రోజుల పాటు గ్రామంలో జరుగుతుందని, పూర్తి వివరాలను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు.

అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చాలి : ఆర్డీవో



సమావేశంలోరాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హులైన వారందరినీ ఓటర్లుగా చేర్చాలని ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో, సహాయ ఓటర్ల నమోదు అధికారులతో గురువారం సాయంత్రం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గానీ, పట్టణంలో గానీ 1200 ఓట్ల కంటే ఎక్కువగా ఓట్లు కేంద్రాల వివరాలను తన దృష్టికి తేవాలన్నారు. గ్రామాల్లో చనిపోయిన వారి వివరాలను, పెళ్లిళ్ల అయి వేరే గ్రామాలకు వెళ్లిన వారి వివరాలను రాజకీయ పార్టీల నేతలు సహాయ ఓటర్ల నమోదు అధికారులకు తెలియజేయాలన్నారు. ఓటర్ల నమోదుకు సంబంధించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావశంలో తహసీల్దార్లు చక్రవర్తి, దుర్గేష, భవానీ శంకర్, పుల్లారావు, కమిషనర్ ఆనంద్‌కుమార్, నాయకులు నూర్ బాషా జానీబాబు, బత్తుల నాగేశ్వరరావు, కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలు ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ



దాచేపల్లిలో డ్రగ్స్ పై అవగాహన కల్పిస్తున్న సీఐ భాస్కరరావు

దాచేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ భాస్కరరావు అన్నారు. డ్రగ్స్ వాడకంతో కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేస్తూ గురువారం ఆటో డ్రైవర్లకు, ఇతర వాహన చోదకులకు, యువకులకు అవగాహన కల్పించారు. దాచేపల్లి నగర పంచాయతీలో నారాయణపురం, పాత బస్టాండ్ సెంటర్, లైబ్రరీ సెంటర్, జమ్మిచెట్టు సెంటర్, నడికూడి రైల్వే స్టేషన్, మాచర్ల టర్నింగ్ వివిధ జన సమర్థవంతంగా ఉండే ప్రాంతాల్లో డ్రగ్స్ వాడకంతో కలిగే నష్టాలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమాల్లో ఎస్ఐలు పాపారావు, సౌదర్ రాజన్, సిబ్బంది ఉన్నారు.

మాచర్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం జంక్షన్‌లో డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ఫ్లకార్డులు చేతబూని ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహులు, ఏఎస్ఐ రఫి, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చిని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



మిర్చి రైతులతో మాట్లాడుతున్న సీపీఐ బృందం

క్రోసూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మిర్చిని క్వింటాల్ రూ.21వేలకు రైతుల నుం చి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని సీపీఐ, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు గ్రా మాల్లో సీపీఐ బృందం మిర్చి పొలాలను, కల్లాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఒక ఎకరంలో మిర్చి పండించటానికి రూ 2.50 లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని, కౌలు రైతులకు ఇంకా అధికంగా ఖర్చవుతుం దని, 12 క్వింటాళ్ళ లోపే దిగుబడి వస్తుం దని, ఈ పరిస్థితుల్లో వారికి గిట్టుబాటు ధర లభించకపోతే తీవ్రంగా నష్ట పోతారన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు కోలుకోవాలంటే కేంద్రం హామి ఇచ్చిన విధంగా రూ.21వేల మద్దతు ధర ఇస్తేనే రైతులు కోలుకుంటార న్నారు. సీపీఐ బృందం నాయకులు పీస పాడు, ఎర్రబాలెం, 88 తాళ్ళూరు గ్రామాల్లో పర్యటించారు. బృందంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పీ రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, నియోజక వర్గ రైతు సంఘం అధ్యక్షుడు కంచేటి పెద్దబ్బాయి, సీపీఐ నాయకులు పాండు, ఆకుల శ్రీనివాసరావు, రామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఆటో ఏర్పాటు

గురజాలటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడుగుల ప్రభుత్వోన్నత పాఠశాలలో 16 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరు గురజాల పట్టణంలో పరీక్షలు రాస్తున్నారు. గ్రామం నుంచి గురజాలకు ఆర్టీసీ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన టీడీపీ నేతలు యాగంటి రామారావు, యేచూరి సతీష్‌లు తమ సొంత ఖర్చుతో పదో తరగతి విద్యార్థుల రాకపోకలకు గ్రామం నుంచి గురజాలకు మూడు ఆటోలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు టీడీపీ నేతలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఊయల తాడు బిగుసుకొని బాలుడి మృతి



హత్వికొరెడ్డి (ఫైల్)

రెంటచింతల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఊయల తాడు బిగుసుకొని ఓ బాలుడు మృతిచెందిన సంఘటన రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాన్యంలో గురువారం జరిగింది. చలిబండ్ల హత్వికొరెడ్డి (10) స్థానిక ఫాతిమా విద్యానికేతన్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. రోజూ ఇంట్లో ఊయలలో ఊగినట్లే గురువారం కూడా ఇంట్లో ఊయలలో అతివేగంతో ఊగగా ఊయలకున్న తాడు మెలికలు పడి బాలుడి గొంతుకు బిగుసుకొని చనిపోయాడు. తల్లి నిర్మలారాణి ఫాతిమావిద్యానికేతన్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. నిర్మలారాణి, రాజు దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఫాతిమా విద్యానికేతన్ కరస్పాండెంట్ ఏరువ ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ మర్రెడ్డి, హెచ్‌ఎం స్టెఫి తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీచర్ నిర్మాలారాణిని ఓదార్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కారంపూడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని నరమాలపాడులో గురువారం జరిగింది. నరమాలపాడు గ్రామానికి చెందిన మాదిరాజు రవి (32) తెల్లవారుజామున 5 గంటల సమయంలో బహిర్భూమికి నడుచుకుంటూ రహదారిపై వెళ్తుండగా విద్యుత్‌సబ్‌స్టేషన్ సమీపంలో వెనుకగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో రవి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వాసు తన సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నకరికల్లు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి కింద పడి మృతి చెందిన ఘటన గురువారం కుంకలగుంటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజుపాలెం మండలం ఇనిమెట్లకి చెందిన మక్కెన వీరయ్య(60) బైక్‌పై గురువారం కుంకలగుంటలో బంధువుల ఇంటికి బయల్దేరాడు. కుంకలగుంట శివారులో ఆంజనేయ స్వామి గుడి సమీపాన బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. వీరయ్య తల దిమ్మెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా వీరయ్య, అతని భార్య, నరసరావుపేటలోని ఒక పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్య ఫిర్యాదు మేరకు నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి

దాచేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వేగంగా ప్రయాణం చేస్తున్న యువకుడు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం దాచేపల్లిలోని మిర్చి యార్డు వద్ద జరిగింది. మృతుడు మాచర్ల సమీపంలోని కంభంపాడు గ్రామానికి చెందిన అనీల్ (24)గా తెలిపారు. దాచేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

అంగన్ వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అధికారుల వేధింపులు తాళలేక పట్టణంలోని 25వ వార్డుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి గురువారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈనెల 18వ తేదీ పల్నాడు జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి ఉమాదేవి పట్టణంలోని 22, 25, 27 వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి లోపాలను గుర్తించారు. లోపాలపై వివరణ కోరుతూ స్థానిక సీడీపీవో, ఏసీడీపీవో సూపర్‌వైజర్‌కు మెమో జారీ చేశారు. ఉమాదేవి తనిఖీ చేసిన వాటిలో జ్యోతి పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది.

రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

కారంపూడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో రేషన్ కార్డు కలిగిన వారు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈకేవైసీ నమోదు కాని వారు 6 వేలకు పైగా ఉన్నారన్నారు. ఈకేవైసీ నమోదు చేయించుకోని వారు సంబంధిత డీలరు వద్ద నమోదు చేయించుకోవాలన్నారు.

రైతుల సహకారంతో నాచు తొలగింపు



ట్రాక్టర్ సహకారంతో నాచును తొలగిస్తున్న దశ్యం

బెల్లంకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ గరికపాడు కాలువలో నాచుతో మూసుకుపోవటంతో నాలుగు రోజుల నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన నాచుతో మూసుకుపోయిన గరికపాడు కాలువ అనే వార్తకు స్పందించిన కెనాల్స్ అధికారులు, బెల్లంకొండ రైతులు ట్రాక్టర్ సహకారంతో చప్టా లోపల ఉన్న ఉన్న నాచును, పీచును తొలగించారు. ఎండిపోయే దశలో ఉన్న మిర్చి పంటలకు నీరు రావటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చింతపల్లి మేజరుకు మరో వారం రోజులు తాగునీరు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



క్రోసూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మేజరు కాలువకు మరో వారం రోజుల పాటు సాగునీటిని కొనసాగించి పంటలను రక్షిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రైతులకు హామీ ఇచ్చారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడారు. ఇప్పటికే కెనాల్స్ అధికారులతో మాట్లాడామని, మరో వారం రోజుల పాటు నీటి విడుదలను కొనసాగించి పంటలు ఎండిపోకుండా చేస్తామని తెలియజేశారన్నారు. నీటి విడుదలకు సంబంధించి రైతులను ఇబ్బంది పెట్టవద్దని, ఎకరా పొలం కూడా ఎండి పోకుండా రైతులకు సాగునీరు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు ఎమ్మెల్యే తెలియజేశారు. సాగునీటి కోసం దొడ్లేరులో రైతులు రాస్తారోకో చేసిన విషయం విదితమే. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రైతుల సంక్షేమమే మా ప్రథమ ప్రాధాన్యం అని, ఎట్టి పరిస్థితుల్లో కూడా పంటలను ఎండిపోనివ్వమని రైతులకు తెలియజేస్తున్నామన్నారు.

లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2014 - 19 మధ్య గోదావరి, పెన్నా నదుల అనుసంధానం చేస్తూ రూ.6వేల కోట్లతో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం అసెంబ్లీలో మాట్లాడారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెం, క్రోసూరు మండలం ఎర్రబాలెం వద్ద వంద కోట్లకు పైగా విలువైన మెటీరియల్ కూడా కొనుగోలు చేసి పెట్టారన్నారు. దురదృష్టవశాత్తు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టును నిలిపి వేశారన్నారు. తిరిగి ఆ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని జలవనరుల శాఖ మంత్రిని అసెంబ్లీలో కన్నా లక్ష్మీనారాయణ కోరారు.

ప్రభుత్వ హామీల కమిటీలో జూలకంటికి చోటు

మాచర్లటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే అసెంబ్లీలో కీలక కమిటీల నియామక ప్రక్రియను గురువారం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి ప్రభుత్వ హామీల కమిటీలో సభ్యుడిగా అవకాశం దక్కింది. ఈ కమిటీకి చైర్మన్ కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు. ఈ కమిటీ ప్రజలకు జవాబుదారీగా ఏడాదిపాట అసెంబ్లీలో వ్యవహరించనుంది. తనపై నమ్మకముంచి ప్రభుత్వ హామీల కమిటీలో తనకు చోటు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌లకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రుణాల గోల్‌మాల్‌పై సాంకేతిక నిపుణులతో విచారణ

ఎఫెక్ట్



సాంకేతిక నిపుణుల బృందంతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పొదుపు (డ్వాక్రా) సంఘాల ద్వారా మహిళలకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే ఆ ఆశయానికి మెప్మా, ఆర్పీలు తూట్లు పొడిచారు. గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అండదండలతో ఆర్పీలు నకిలీ గ్రూపులను సృష్టించి వివిధ బ్యాంకుల నుంచి సుమారు రూ.5 కోట్ల రుణాలు మంజూరు చేయించి కాజేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన డ్వాక్రా ముసుగులో.. టోపి శీర్షికన వార్త ప్రచురితం చేయడంతో పురపాలక సంఘం స్పందించింది. ఉన్నతాధికారుల ద్వారా విచారణ జరపాలని కోరడంతో గురువారం సాంకేతిక నిపుణులు నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, గురజాల నుంచి నలుగురితో కూడిన బృందం మాచర్లలో వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందిన గ్రూపుల జాబితాను పరిశీలించింది. అనంతరం మున్సిపల్ చైర్మన్ నరసింహారావును కలిసి తాము పరిశీలించిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

సాంబయ్యనాయక్‌పై చర్యలు తీసుకోవాలి

● పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి

నకరికల్లు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బాలాజీనగర్ తండాలో ఇళ్ళను ఎక్స్‌కవేటర్‌తో పడగొట్టిన సాంబయ్యనాయక్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి కోరారు. బాలాజీనగర్ తండాకు కాట్రావత్ సాంబయ్య నాయక్ ఆ సుగాలీల భూమిని కాజేయాలనే ఉద్దేశంతో ఇల్లు పడగొట్టించాడని ఆరోపించారు. గతంలోను సుగాలీల గుడిసెలను సాంబయ్యనాయక్ తగల బెట్టించాడని పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ అన్నారు. సాంబయ్య అధికారుల మద్దతుతోనే ఇదంతా జరుగుతుందని, ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పీడీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కే పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై వెంకటేశ్వరరావు, కృష్ణానాయక్, రామునాయక్, అంజినాయక్, తండావాసులు పాల్గొన్నారు.

వంద మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన



వ్యోమగామి సునీత విలియమ్స్‌కు స్వాగతం చెబుతూ జాతీయ జెండా ప్రదర్శిస్తున్న వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

అచ్చంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్‌కు స్వాగతం చెబుతూ గురువారం వంద మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రోసూరు ఎక్సైజ్ సీఐ టీ తులసీ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అగస్టిన్‌రెడ్డి, హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నిరసన

పిడుగురాళ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి తెలగపల్లి శ్రీను మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, చెప్పులు, సబ్బులు, నూనె, యూనిఫాంలు వెంటనే ఇవ్వాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశాల్లో మంచినీరు సౌకర్యం కల్పించాలని, పండుగ సెలవులు, క్యాజువల్ లీవ్‌లు అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు కొండలు, ప్రతాప్, పరమేషు, చల్లా పద్మ, మేరి గ్రేసు, దేవి, యలమంద, కంపా సాగర్, బత్తుల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఏమంటివి.. ఏమంటివి

ఏకపాత్రాభినయంలో అబ్బురపరిచిన రఘురామ
దుర్యోధనుడి అభినయంతో ప్రథమ బహుమతి
చీఫ్ విప్ జీవీ జట్టు స్కిట్ 'ఇదీ సంగతి'కి ప్రథమ స్థానం
ముగిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల క్రీడా, సాంస్కృతిక పోటీలు

విజయవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య దేవా.. ఏమంటివి.. ఏమంటివి.. అంటూ దానవీరశూరకర్ణ చిత్రంలో దుర్యోధనుడు పాత్రధారి చెప్పిన డైలాగుతో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం అబ్బురపరిచింది. రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల క్రీడా, సాంస్కృతిక పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజయవాడ ఏ-కన్వెన్షన్‌లో తొలుత సాంస్కృతిక పోటీలు నిర్వహించి అనంతరం విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు బహుమతులు అందజేశారు. ఏకపాత్రాభినయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రథమ బహుమతి అందుకున్నారు. పల్నాటి బాలచంద్రుడి వేషం ధరించిన మంత్రి కందుల దుర్గేశ్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. స్కిట్లలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బృందం ప్రదర్శించిన 'ఇదీ సంగతి' ప్రథమ బహుమతిని, ఈశ్వరరావు, విజయ్‌కుమార్ ప్రదర్శించిన 'అసందర్భపు పాట' ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి.


క్రికెట్లో మొదటి బహుమతి సాధించిన జట్టు కెప్టెన్ మంత్రి మనోహర్‌కు బహుమతి అందజేస్తున్న చంద్రబాబు, పవన్


పరుగు పందెంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ విభాగంలో మంత్రి టీజీ భరత్ ప్రథమ బహుమతి, జయనాగేశ్వరెడ్డికి ద్వితీయం. డబుల్స్ విన్నర్లుగా మంత్రి సత్యకుమార్- జయనాగేశ్వరెడ్డి. భరత్-పీవీ పార్థసారథి రన్నర్స్‌గా మహిళల సింగిల్స్ విజేత పి.సింధూరరెడ్డి. భూమా అఖిల ప్రియకి ద్వితీయం, డబుల్స్ విన్నర్లుగా అఖిలప్రియ-సింధూరరెడ్డి, రన్నర్లుగా మంత్రి సవిత-శ్రావణిశ్రీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో మంత్రులు టీజీ భరత్-సవితకు ప్రథమం. అఖిలప్రియ, జయనాగేశ్వరెడ్డికి ద్వితీయం. బ్యాడ్మింటన్ 60 ఏళ్ల పైబడిన విభాగంలో అరవింద్‌బాబు విన్నర్. శివరామిరెడ్డి రన్నర్. 55 ఏళ్ల పైబడిన విభాగంలో గద్దె రామ్మోహన్ ఫస్ట్. రవీంద్రబాబు ద్వితీయం.

పరుగుపందెం: 100 మీటర్ల పరుగు పందెం 50 ఏళ్లలోపు విభాగంలో అరవ శ్రీధర్ ప్రథమ, విజయచందర్ ద్వితీయ, కాకర్ల సురేశ్ తృతీయ బహుమతి. 60 ఏళ్లలోపు విభాగంలో కేఈ శ్యామ్‌కుమార్, సత్యకుమార్, పీవీ పార్థసారథికు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు. 60 ఏళ్ల పైబడిన విభాగంలో బి.రామాంజనేయులికి ప్రథమం, గద్దె రామ్మోహన్ ద్వితీయం. గోరంట్ల బుచ్చయ్యచౌదరికి తృతీయం.

100 కిలోల లోపు బరువు: కె.శ్రీకాంత్, విజయ్‌కుమార్, బొజ్జల సుధీర్‌రెడ్డికి మొదటి మూడు బహుమతులు. మహిళల విభాగంలో ప్రథమ బహుమతిని పి.సింధూరరెడ్డి, ద్వితీయ బహుమతిని రెడ్డప్పగారి మాధవి, తృతీయ బహుమతిని వంగలపూడి అనిత గెలుచుకున్నారు.

షాట్‌పుట్: పురుషుల 60 ఏళ్లలోపు విభాగంలో బి.విజయచందర్, ఆదిరెడ్డి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మొదటి, రెండు, మూడో స్థానాలు. 60 ఏళ్ల పైబడిన విభాగంలో కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, ఎంఎం కొండయ్యయాదవ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు.

మ్యూజికల్ చైర్స్: మొదటి స్థానాన్ని మిరియాల శిరీషాదేవి, ద్వితీయ స్థానాన్ని సవిత, మూడో స్థానాన్ని పి.సింధూరరెడ్డి గెలుచుకున్నారు.

టెన్నిస్: పురుషులు సింగిల్స్‌లో నాదెండ్ల మనోహర్ విన్నర్, పీవీ పార్థసారథి రన్నర్

టేబుల్ టెన్నిస్: పురుషుల విభాగంలో వర్ల కుమార్‌రాజా విన్నర్, కేఈ శ్యామ్‌కుమార్ రన్నర్.

క్యారమ్స్: పురుషులు విభాగంలో గద్దె రామ్మోహన్ ఫస్ట్. వంకా రవీంద్రనాథ్‌కు ద్వితీయం. మహిళల విభాగంలో కర్రి పద్మశ్రీ ప్రథమ, గౌరు చరితారెడ్డి ద్వితీయ,


దుర్యోధనుడి వేషంలో రఘురామకృష్ణరాజు

రెడ్డప్పగారి మాధవికి తృతీయ బహుమతి. డబుల్స్ విభాగంలో నెలవల విజయశ్రీ, మిరియాల శిరీషాదేవి విజేతలు. తంగిరాల సౌమ్య, జగదీశ్వరి రన్నర్స్.

కబడ్డీ: సీఎం జట్టు విన్నర్స్, స్పీకర్ జట్టు రన్నర్స్. మూడోస్థానంలో బుచ్చయ్యచౌదరి టీం.

వాలీబాల్: అయ్యన్నపాత్రుడు టీం విజేత.. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జట్టు రన్నర్స్.

టగ్గాఫ్ వార్: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జట్టు విజయ కేతనం. పురుషుల విభాగంలో బుచ్చయ్యచౌదరి జట్టు ప్రథమ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు జట్టు ద్వితీయ బహుమతి.

త్రోబాల్: అఖిలప్రియ జట్టుకు మొదటి స్థానం. మంత్రి అనిత జట్టుకు ద్వితీయం.

టెన్నికాయిట్: పురుషుల సింగిల్స్‌లో సత్యకుమార్, గద్దె రామ్మోహన్, వంకా రవీంద్రనాథ్‌కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు. మహిళల డబుల్స్‌లో కర్రి పద్మశ్రీ-అఖిలప్రియ విన్నర్స్. కోళ్ల లలితకుమారి-సింధూరరెడ్డి రన్నర్స్.

క్రికెట్: విజేత మంత్రి నాదెండ్ల మనోహర్ జట్టు. రన్నర్స్‌గా మంత్రి సత్యకుమార్ జట్టు.


బ్యాడ్మింటన్‌లో విన్నర్‌గా నిలిచి బహుమతి అందుకుంటున్న ఎమ్మెల్యే అరవిందబాబు


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు


ఇదీ సంగతి స్కిట్‌లో జీవీ ఆంజనేయులుతో కలిసి ప్రదర్శన ఇస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, అరవిందబాబు

ఒకటికి మించి..

యార్డులో కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ లైసెన్సులు
ఇప్పటికే 134 గుర్తించాం... మరో 27 కూడా జాబితాలో ఉన్నాయి
మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత


మిర్చియార్డులో అధికారులు, సిబ్బందితో సమావేశమైన మార్కెటింగ్ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయ సునీత

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ఒకే కుటుంబంలో ఒకటి ఎక్కువమందికి లైసెన్సులు ఉన్నవి గుర్తించామని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయసునీత చెప్పారు. ఇలా ఇప్పటికే 134 లైసెన్సులను పటుకున్నాం. మరో 27 కూడా ఇలాంటివే ఉన్నాయి. వీటన్నింటిపై ఒక సమగ్ర నివేదికని రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. మిర్చియార్డులో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించడంతో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత గురువారం మిర్చియార్డు పరిపాలన భవనానికి వచ్చి సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందితో సుదీర్ఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత నెల 22వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు మిర్చియార్డుపై 4 గంటల పాటు సమీక్ష నిర్వహించారని, ఆ సమావేశంలో సీఎం జారీ చేసిన ఆదేశాలను ఏమేరకు అమలు చేస్తున్నారనేది సమీక్షించేందుకు తాను రావడం జరిగిందన్నారు.

రైతుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్య ధోరణి పనికి రాదు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. యార్డులో కొంతమంది వ్యాపారస్థులు ఎలాంటి లైసెన్సులు లేకుండానే మిర్చి వ్యాపారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలానే కొందరు లైసెన్సులు ఉండి ఎలాంటి వ్యాపారలు చేయడం లేదన్నారు. గత మూడు నెలల్లో మిర్చి లావాదేవీలకు సంబంధించి రిపోర్టుని ఇవ్వమని కమీషన్ ఏజంట్లను ఆదేశించాం. ఎవరైతే ఇవ్వరో వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. అలానే ఇంకా జీరో, కటింగ్, బిల్-టూ-బిల్ వ్యాపారాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. మచ్చుకాయలను తీసుకోవడం కూడా నిరోధించడం లేదు. వీటన్నింటిపై కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మిర్చియార్డులో వ్యాపారం చేయాలంటే నిబంధనల మేరకు లైసెన్సు పొంది ఉండాల్సిందేనన్నారు.

కర్ణాటక నుంచి ఎక్కువ మోతాదులో మిర్చి టిక్కీలను ఇక్కడి కమీషన్ వ్యాపారస్థులు తెప్పిస్తున్నారు. దీని వలన స్థానిక రైతుల మిర్చి నాణ్యతగా ఉన్నా ధర పెరగడం లేదు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకొంటామన్నారు. ప్రస్తుతం మూడో పంట కోతల మిర్చి వస్తున్నది. వాటిల్లో నాణ్యత ఉండటం లేదు. అలానే తాలు, తేమశాతం ఎక్కువ మోతాదులో ఉంటుండటం వలన కూడా ధర పెరగడం లేదన్నారు. ఈ విషయంలో రైతులు సహకరించి బాగా ఎండబెట్టి మిర్చిని గ్రేడింగ్ చేసుకొని యార్డుకు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్లు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, ఏడీ రాజబాబు, సెలెక్షన్‌గ్రేడ్ సెక్రెటరీ ఏ చంద్రిక, వివిధ గ్రేడ్‌ల కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, ఆంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జడ్పీకి.. బకాయిల భారం

రావాల్సిన అద్దెలు రూ.1.22 కోట్లు.. అతిథిగృహాల్లో పేరుకుపోయిన బాకీలు

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అసలే నిధుల లేమితో అల్లాడిపోతున్న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు అద్దె బకాయిలు మరింత తలనొప్పిగా మారాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇంకా రూ.1.22 కోట్ల వరకు అద్దె బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ అతిథి గృహాల్లో కూడా అద్దె బకాయిలు పేరుకు పోవటం పట్ల జడ్పీ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా అద్దె బాకీలు పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడంతో జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశారు.

జిల్లా పరిషత్‌కు చెందిన పంచాయతీ రాజ్ అతిథి గృహాలు ఉమ్మడి జిల్లాలో ఆరు ఉన్నాయి. వాటి బకాయిలు రూ. 40.94 లక్షల వరకు రావాల్సి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్‌కు 10 షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వాటి బకాయిలు రూ. 66.85 లక్షల వరకు బాకీలు పేరుకుపోయాయి.

9 పెర్రీలకు రూ. 16.50 లక్షల బాకీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి వసూళ్ల కోసం వెళ్లటం జరుగుతుంది. పదే పదే హెచ్చరించినా అద్దెలు చెల్లించకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయి అని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ అన్నారు.

పరాశక్తికి అదనపు గనుల రద్దు

◆ అదనంగా ఉన్న 13.899 హెక్టార్ల తొలగింపు ◆ గోలి రిజర్వు ఫారెస్టు హద్దు వద్ద ఉండటమే కారణం ◆ 317.782 హెక్టార్లలో మాత్రమే మైనింగ్‌కి అనుమతి ◆ ఎర్రాట జారీ చేసిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పరాశక్తి సిమెంట్స్‌కి రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం(గోలి) గ్రామంలో కేటాయించిన సున్నపురాయి గనుల్లో అధికంగా ఉన్న 13.899 హెక్టార్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ తొలగించింది. ఈ భూములు గోలి రిజర్వు అటవీ భూమికి సమీపంలో ఉన్నందున ప్రభుత్వం రద్దు నిర్ణయం తీసుకున్నది. దీంతో ఆ సంస్థకు కేటాయించిన 317.782 హెక్టార్లలో మాత్రమే సున్నపురాయి మైనింగ్ చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. ఈ మేరకు ఎర్రాటని ప్రభుత్వం జారీ చేసింది. పరాశక్తి సిమెంట్స్‌కి 2011 జూన్‌లో సర్వే నంబరు.494/10, 11, 12లో 180.9089 హెక్టార్లను సున్నపురాయి మైనింగ్ కోసం ప్రభుత్వం కేటాయించింది. లీజు కాలాన్ని 30 ఏళ్లుగా నిర్ణయించింది. 2007 జూన్‌లో జెట్టిపాలెంలోని సర్వే నంబరు.426లో మరో 137.693 హెక్టార్లను 30 ఏళ్ల లీజుకు కేటాయించింది. ఆ తర్వాత ప్రభుత్వం ఈ రెంటింటిని కలిపి 317.900 హెక్టార్లకు ఒక లీజుగా మార్చింది. అలానే లీజు కాలాన్ని 2017లో 50 ఏళ్లకు పొడిగించింది. ఆ తర్వాత 2023లో దాచేపల్లి మైనింగ్ ఏడీ ప్రభుత్వానికి లేఖ రాస్తూ డీజీపీఎస్ సర్వేలో 331.681 హెక్టార్లను గుర్తించారు. అదనంగా ఉన్న 13.899 హెక్టార్ల గనుల్లో ఎలాంటి మైనింగ్ ఆపరేషన్స్ జరగలేదని నివేదించారు. గత ఏడాది సెప్టెంబరులో మైనింగ్ డైరెక్టర్ ఈ మేరకు సమగ్ర నివేదిక అందజేయగా ప్రభుత్వం గురువారం అదనంగా ఉన్న సున్నపురాయి గనులను తొలగించింది. అదేవిధంగా ఆ సంస్థకు 50 ఏళ్లకు కేటాయించిన లీజు ప్రకారం 317.900 హెక్టార్లను ఖరారు చేసింది.

సర్వేలతో.. సతమతం



ఒక్కొక్కరికి నాలుగు క్లస్టర్లతో ఇబ్బందే అంటున్న సచివాలయ ఉద్యోగులు

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వాటర్ టాప్ కనెక్షన్ సర్వే.. హౌస్ హోల్డ్ సర్వే.. ప్రతి ఇంటి జియో టాగింగ్ సర్వే... ఎంఎస్ఎంఈ సర్వే.. చిల్డ్రన్ వితౌట్ ఆధార్ సర్వే... పీ4సర్వే.. వర్క్ ఫ్రం హోం సర్వే... ఇలా చదువుతూ పోతే బోలెడు సర్వేలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఒకదాని తర్వాత ఒకటి వరుసగా వస్తుండటంతో సచివాలయం ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. అన్ని సర్వేలకు నియమిత కాల వ్యవధి నిర్ణయించడం కూడా ఉద్యోగులను ఒత్తిడికి గురిచేస్తున్నది. అన్ని శాఖల సర్వేలు కలగాపులగంగా ఉండటం కూడా తీవ్ర గందరగోళానికి గురిచేస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 13,424 మంది ఉద్యోగులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. చివరకు సెలవు రోజుల్లో కూడా సర్వేలు చెయ్యాల్సి రావటం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తుంది.

ఒక్కరికీ నాలుగు క్లస్టర్లు...

సర్వేల కోసం గ్రామాన్ని క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో ఉద్యోగికి నాలుగు క్లస్టర్లు తగ్గకుండా వస్తున్నట్లు తెలుస్తుంది. నాలుగు క్లస్టర్లకు సుమారు 250 నుంచి 300 వరకు గృహాలు ఉంటున్నాయి. ఆ గృహాలకు సంబంధించిన పూర్తి బాధ్యత సర్వే చేస్తున్న ఉద్యోగిపై పడుతుందని చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో వార్డు సచివాలయాలు 336, గ్రామ సచివాలయాలు 232, పల్నాడు జిల్లాలో వార్డు సచివాలయాలు 141, గ్రామ సచివాలయాలు 397, బాపట్ల జిల్లాలో వార్డు సచివాలయాలు 69, గ్రామ సచివాలయాలు 408 ఉన్నాయి. వార్డు, గ్రామ సచివాలయాలలో సర్వే వ్యవహారంలో ఒకే సమస్యను ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దివ్యాంగులపై కూడా అదే పనిభారం పడుతుంది. సర్వేల విషయంలో పనిని పంచుకునేందుకు తోటి ఉద్యోగులు ఇష్టపడక పోవడంతో నడవలేని స్థితిలో కూడా కొందరు దివ్యాంగులు ఇంటింటికి తిరగాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఆయా సర్వేలు చేసేందుకు గత ప్రభుత్వం వలంటీర్లకు ఫోన్ లు అందజేసింది. వాళ్ళు రాజీనామా చేసిన తర్వాత తిరిగి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఆ ఫోన్లు మూలన పడేశారు .దాంతో సచివాలయ ఉద్యోగులు సొంత ఫోన్లతోనే సర్వేలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మొబైల్ నెట్ బ్యాలెన్స్ కూడా సొంత నిధులతోనే వేస్తున్నట్లు చెబుతున్నారు.

ఆయా విషయాలపై స్పందిస్తూ సర్వేల పేరిట సచివాలయ ఉద్యోగులను తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మధు అన్నారు.

పాత బకాయిలపై...
సీటీ శాఖ కొరడా

● బకాయిల వసూళ్ళకు రంగంలోకి ప్రత్యేక బృందాలు
● వాహన తనిఖీలు ముమ్మరం
● రైల్వే పార్శిల్స్ రాకపోకలపై స్పెషల్ ఫోకస్

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే కీలక శాఖల్లో ఒకటైన వాణిజ్యపన్నులశాఖ పాత బకాయిల వసూళ్ళపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా ఆ శాఖ అధికారులు పాత బకాయి లు, జీఎస్టీ రిటర్న్స్ పెండింగ్ జాబితాలోనున్న వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖలో జూని యర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి నుంచి డీసీటీవో స్థాయి అధికారుల వరకు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి బకాయి వసూళ్ళకు రంగంలోకి దించారు. అత్యవసరమైతే మినహా ఉద్యోగులకు సెలవులు కూడా ఇచ్చేది లేదని మౌఖి కంగా చెప్పినట్లు సమాచారం. గుంటూరు-1, పల్నాడు డివిజన్‌ల జాయింట్ కమిషనర్‌లు శ్రీ లక్ష్మీ, గీతామా ధురీలు బకాయిల వసూళ్ళపై కింది స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యాట్‌లో ఉన్న బకా యిలు కోట్ల రూపాయల్లో ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా గుంటూరు-1 డివిజన్‌తో పాటు బాపట్ల డివిజన్‌ల పరిధిలోని సర్కిల్స్‌లో ఉన్న పాత బకాయిదారుల జాబితాలను సిద్ధం చేశారు. ఆయా బకాయిల వసూళ్ళ కోసం ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే గుంటూరు రైల్వే స్టేషన్ కేంద్రంగా రైళ్లలో పార్శిల్స్ రాకపోకలపై వాణిజ్యపన్నుల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉగాది, రంజాన్ పండుగలతో పాటు ఆర్థిక సంవత్సరాంతం కావటంతో పార్శిల్స్‌పై అధికారుల తనిఖీలు ముమ్మరం చేశారు. పార్శిల్స్‌లో వచ్చే ఉత్పత్తులకు బిల్లులను నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. మరో వైపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లోనూ పార్శిల్ ఉత్పత్తులను తనిఖీలు చేస్తున్నారు.


వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం

చర్చనీయాంశంగా మారిన డ్రైవర్ల తొలగింపు

వాణిజ్యపన్నులశాఖలో అక్రమ వసూళ్ళకు పాల్పడ్డారన్న ఆరోపణపై వాహన తనిఖీల విధుల నుంచి పది మంది వరకు ప్రైవేటు వాహన డ్రైవర్ల తొలగించటం ఆ శాఖలో కలకలం రేకెత్తిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో గురువారం సీటీ శాఖలో పది మంది డ్రైవర్లపై వేటు అనే కథనం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. కాగా వాహన తనిఖీలు, పన్ను ఎగవేతదారుల నుంచి పెనాల్టీ వసూళ్ళ వంటి వివరాలను ఆ శాఖ అధికారులు కూడా గోప్యత పాటించటం కూడా చర్చనీయాంశంగా మారుతోంది.


జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు

రోడ్డుకు ఇరువైపులా...
భూమి సేకరించాలి

544డీ జాతీయ రహదారి భూసేకరణపై జేసీకి రైతుల వినతి

నరసరావుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణలో భాగంగా 544డీ జాతీయ రహదారికి ఇరువైపుల భూమి సేకరించాలని రైతులు కోరారు. గురువారం నరసరావుపేట కలెక్టరేట్‌లో జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాకాని, పెట్లూరివారిపాలెం, ఉప్పలపాడు, ఎస్సీ, బీసీ కాలనీల రోడ్డు మార్గాన రోడ్డు కుడివైపు మాత్రమే సర్వేచేసి, కావాల్సిన భూమిని తీసుకోవడానికి ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. రోడ్డు సెంటర్ పాయింట్ నుంచి 74+74=148 అడుగుల ఆర్అండ్‌బీ రోడ్డు ఉందన్నారు. నేషనల్ హైవే 180 అడుగుల అవసరం ఉంటుందన్నారు. రెండు వైపులా భూమిని తీసుకుంటే ప్రభుత్వం వారికి 32 అడుగులు మాత్రమే అవసరం ఉంటుందని చెప్పారు. 16 అడుగుల వంతున ఇరువైపుల రైతుల నుంచి భూమిని సేకరిస్తే ప్రభుత్వానికి కూడా చాలా ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డుకు ఇరువైపుల భూమి సేకరించి రైతులు, రైతు కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేయాలని,వ్యవసాయ భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా విద్యుత్‌శాఖ ఉద్యోగుల పోటీలు

● నేటితో క్రీడలు ముగింపు


పర్యావరణంపై చైతన్యవంతం చేసేలా మహిళా ఉద్యోగి వేషధారణ

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగులు ఆ శాఖ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గుంటూరులో జరుగుతోన్న క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ఆట పాటలు, క్రీడలతో ఉత్సాహంగా హాజరయ్యారు. ఎన్‌టీఆర్ స్టేడియం వేదికగా క్రీడలు జరుగుతుండగా, సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యుత్‌శాఖలోని మహిళా ఉద్యోగులకు ఈనెల 19 నుంచి 21 వరకు క్రీడా, సాంస్కృతిక పోటీలు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రెండో రోజు గురువారం కూడా క్రీడల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. చెస్, బ్యాట్మింటన్‌లో సింగిల్స్, డబుల్స్, క్యారమ్స్ డబుల్స, టెన్ని కాయిడ్ విభాగాల్లో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యుత్ భవన్‌లో కూడా ప్రజల్ని చైతన్యవంతం చేసే పర్యావరణానికి సంబందించిన నాటికలు వేసి స్ఫూర్తి నింపారు. అనంతరం విజేతల పేర్లను ప్రకటించారు. కార్యక్రమంలో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, బాపట్ల ఎస్ఈ ఆంజనేయులు, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అధికారులు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి: చీఫ్‌విప్ జీవీ

వినుకొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా వివిధ వ్యాపారాలకు రాయితీపై ఇచ్చే రుణాలను వినుకొండ నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇస్తారన్నారు. దరఖాస్తుదారులు పెట్టే యూనిట్‌ని బట్టి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు వివిధ విభాగాల్లో రుణాలు అందిస్తారన్నారు. రుణాలపై రాయితీ కూడా లభిస్తుందని తెలిపారు. వినుకొండ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

వినుకొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, వైస్ ఛైర్మన్‌లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ అశోక్ కుమార్ తెలిపారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలోని ఇర్లపాడు, ఎండుగుంపాలెం, బుక్కాపురం, రాజుగారిపాలెం, గున్నంవారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగావకాశాలపై 'కృష్ణవేణి'లో అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఎడ్జిటా కంపెనీ ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు జరిగిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. లింక్డ్ ఇన్, రెజ్యూమ్ హైరింగ్ ట్రెండ్స్ గురించి హైదరాబాద్ ఎడ్జిటా కంపెనీ బృందం క్లుప్తంగా వివరించారు. ఉద్యోగ అవకాశాలకు కావలసిన కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లోని మెలుకువలు, భాషా నైపుణ్యాలను విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి తృతీయ సంవత్సరం వరకు అభివృద్ధి చేసుకున్నట్లయితే ఉద్యోగాలను సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డీ యోగేశ్వరరావు, ఎడ్జిటా కంపెనీ బృందం కో ఫౌండర్ ఎం.నాగహరి, సీనియర్ మేనేజర్ సీహెచ్ పృథ్వి, సీనియర్ అకడమిక్ కౌన్సిలర్ కే గీతిక, షేక్ నాజియ తదితరులు పాల్గొన్నారు.

ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో దివీస్ ల్యాబ్స్ ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో హైదరాబాద్ దివీస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య గురువారం తెలిపారు. 98మంది విద్యార్థులు హాజరు కాగా 41మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.40 లక్షల నుంచి రూ.3లక్షల వరకు వేతనంగా అందజేస్తామని దివీస్ లేబరేటరీ హెచ్ఆర్ కే రామకృష్ణ, జె శివకృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ బీ రవితేజ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

26న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

● వడ్డే హనుమారెడ్డి

నరసరావుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ఈ నెల 26న జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అవ్వారి భావనారాయణ భవన్లో సామాజిక వన రైతుల సంఘం రాష్ట్ర సమితి సమావేశం తాళ్లూరి బాబురావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ పల్నాడు డివిజన్ అటవీ శాఖ పరిధిలోని వినుకొండ, పిడుగురాళ్ళ, మాచర్ల పరిధిలోని 218 వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ కర్ర 50, 935 మెట్రిక్ టన్నులు 2024 నవంబరు 13, 20, 27 తేదీలలో వేలం నిర్వహించటం జరిగిందన్నారు. వ్యాపారులు అనుమతి లేకుండానే కర్ర నరుకుడు ప్రారంభించి అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి తగినచర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ రవాణాకు నిరసనగా ఈ నెల 26న డీఎఫ్‌వో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య, సామాజిక వన రైతుల సంఘం రాష్ట్ర నాయకుడు కే వీరారెడ్డి, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి: రాపర్ల జగ్గారావు

ఈపూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా టీడీపీ నాయకులు కృషి చేయాలని, అందుకోసం ప్రతి ఇంటికీ వెళ్ళి సమస్యలు తెలుసుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ గ్రామం 72 బూత్‌లో కుటుంబ సాధికార సభ్యులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకటనర్సయ్య, జె.బుచ్చారావు, పి.నాగార్జున, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేత కోసం డెల్టా వైపునకు గోవుల వలస


వేసవిలో మేత కోసం తరలివెళ్తున్న గోవులు

వినుకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం కొరతతో గోవులు, జీవాలు వినుకొండ, మార్కాపురం ప్రాంతాల నుంచి వేరే ప్రాంతానికి తరలివెళ్లిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పశుసంవర్ధక శాఖ నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. 2014-19 మధ్యలో ఉన్న అప్పటి టీడీపీ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా గడ్డిని అందించటం, గ్రాసం పెంచేందుకు విత్తనాలు అందించేవారు. అలాగే ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఈ ఏడాది పశుగ్రాసం అందిస్తే వలసలు తప్పుతాయని పశుపోషకులు అంటున్నారు. మార్కాపురం నుంచి డెల్టా ప్రాంతమైన తెనాలి ప్రాంతాలకు ఈ గోవులను తీసుకువెళుతున్నట్లు పశుపోషకులు తెలిపారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్

బాలికల వసతి గృహంలో యాప్‌పై అవగాహన

నరసరావుపేట లీగల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు శక్తి యాప్ ఒక రక్షణ కవచం లాంటిదని పల్నాడు జిల్లా మహిళా పోలీస్ అధికారులు సిబ్బంది పేర్కొన్నారు. ప్రతి ఒక్క మహిళ ఫోన్లో ఈ యాప్‌ను నిక్షిప్తం చేసుకొని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందవచ్చు అని వివరించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలో, ప్రధాన కూడళ్ల వద్ద సెల్ఫ్ డిఫెన్స్‌పై ప్రజలకు అవగాహన శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు అత్యాచారాలు ఇతర హింసాత్మక సంఘటనలను నివారించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శక్తి యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని, వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఓటీపీతో ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలన్నారు. అత్యవసర పరిచయాలను జోడించాలన్నారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే పోలీసులకు కుటుంబ సభ్యులకు స్నేహితులకు సందేశం వెళ్తుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ కంట్రోల్ రూమ్ మహిళ ఉన్న ప్రదేశాన్ని తక్షణమే గుర్తించి సహాయం అందిస్తుందన్నారు. జిల్లాలోని మహిళ విద్యార్థులు బాలికలు ఉద్యోగులు వారి వారి ఫోన్లలో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన శక్తి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నరసరావుపేట, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది, గురజాల నవోదయ డిగ్రీ కళాశాల, నరసరావుపేట శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్, విద్యార్థినులు, మహిళా ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు ఆలయాల్లో చోరీ.. భయాందోళనలో గ్రామస్థులు

● వరుస చోరీలతో సర్వత్రా ఆందోళన ● గస్తీ పెంచాలని పలువురి డిమాండ్

వినుకొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకంచర్ల గ్రామంలో వరుస దొంగతనాలతో గ్రామస్థులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. బుధవారం రాత్రి 11గంటల సమయంలో గ్రామంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయం తాళాలు పగలగొట్టి సుమారు రూ.6లక్షలు విలువ చేసే ఎలక్ట్రిక్ సామాన్లు, సీసీ ఫుటేజీ హార్డ్‌డిస్క్, హుండీలోని నగదు, అమ్మవారి మంగళసూత్రాలు దొంగలు దోచుకెళ్లారు. ఇదిలా ఉండగా గుడి ప్రతిష్ఠకు ముందురోజు దేవాలయంలో దొంగలుపడి సుమారు రూ.80వేలు విలువ చేసే విద్యుత్ సామాన్లను దోచుకున్నారు. గతంలో ఇదే దేవాలయం నిర్మాణ సమయంలో స్వామివారి ఫొటో వద్ద ఏర్పాటు చేసిన హుండీని దొంగలు దోచుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఒకే గుడిలో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే దొంగలు దోచుకోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం గ్రామంలో నివాసం ఉంటున్న హోంగార్డు సాంబయ్య నివాస గృహంలో దొంగలు పడి రూ.10వేలు, ఈ నెల 9వ తేదీన మస్నెం కొండలుకు చెందిన 9 పొటేళ్లు, షేక్ మస్తానమ్మ నివాసగృహంలో దొంగతనానికి ప్రయత్నించినప్పటికీ కేకలు వేయడంతో దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. ఇలా వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంపై గ్రామస్థుల్లో భయాందోళన నెలకొంది. పోలీసులు గురువారం క్లూస్ టీమ్ సాయంతో విచారణ చేపట్టారు. దొంగతనాలను అరికట్టేందుకు గ్రామంలో నిఘాతో పాటు రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రామ దేవతల దేవాలయంలో...

వినుకొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటప్పనగర్ గ్రామ సమీపంలో నూతనంగా ప్రతిష్ఠించిన పోలేరమ్మ తల్లి దేవాలయంలో బుధవారం రాత్రి దొంగలు పడి సుమారు రూ.60వేలు విలువైన సామగ్రితోపాటు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దొంగలు అపహరించారు. ఇదిలాఉండగా పోలేరమ్మ తల్లి దేవాలయంలో దొంగలుపడిన గంటల వ్యవధిలోనే అదే గ్రామం ప్రధాన రహదారిపై ఉన్న అంకమ్మతల్లి దేవాలయంలో దొంగలు పడి అమ్మవారి ముఖద్వారంతో పాటు గ్యాస్ సిలెండర్, ఇత్తడి పొంగళ్ల పాత్ర, హారతి పళ్లాలను దొంగలు దోచుకున్నారు. సుమారు రూ.20వేలు విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఒకే రాత్రి రెండు దేవాలయాల్లో దొంగలుపడి దోచుకోవడంపై గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీమ్ సంఘటనా ప్రాంతానికి చేరుకొని ప్రాథమిక ఆధారాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.

చిరు ధాన్యాల సాగు రైతులకు లాభదాయకం

సీనియర్ సైంటిస్ట్ చంద్రమోహన్‌రెడ్డి

నూజెండ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ అప్పాపురం, నూజెండ్ల గ్రామాల్లో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయం ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో చిరు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాల పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అధిక పోషక పదార్థాలు ఉన్న చిరు ధాన్యాలు ప్రజలకు ఆరోగ్యకరంగా ఉంచేందుకు దోహద పడతాయని, సాగుదారులకూ లాభదాయకంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా సజ్జ, జొన్న, కొర్ర, అండ్రుకొర్రలు, రాగులు, మొక్కజొన్న తదితర పదిరకాల తృణ ధాన్యాలు సాగు చేయటం ద్వారా తక్కువ సమయంలోనే పంటలు చేతికి వస్తాయన్నారు. నీటి ఎద్దడిని తట్టుకొని మేలైన విత్తనాల గురించి, ఆహార పదార్థాల తయారీ గురించి వివరించారు. అదేవిధంగా ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేందుకు మినీ కిట్ల రూపంలో విత్తనాలు అందజేస్తున్నామన్నారు. పంటల యాజమాన్యంపై రైతులకు సూచనలు చేశారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ రమేష్ కుమార్, అప్పాపురం డీసీ ఛైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు లగడపాటి సూరిబాబు, బ్రహ్మానాయుడు, కంచుమాటి తిరుపాలు, చిరంజీవి, వీర నారాయణ, ఏవో సుగుణాబేగం, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు అశోక్, రేవంత్, ఏపీసీఎన్ఎఫ్ మండల యాంకర్ పర్సన్ కే కోటేశ్వరరావు, ఐసీఆర్‌పీ టీ వెంకాయమ్మ, పీ వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



మిల్లెట్స్ సాగుపై రైతులకు వివరాలు తెలియ జేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త చంద్రమోహన్‌రెడ్డి

ఉపాధి హామీ పనులపై ఏసీబీ అధికారుల తనిఖీ

నూజెండ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడు సంవత్సరాల క్రితం రూరల్ అర్బన్ పథకంలో వేసిన నాలుగు సీసీ రోడ్లను ఏసీబీ అధికారులు పరిశీలించి గురువారం విచారణ చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పీ ఉమాదేవి, ఉపాధి హామీ, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశమై రికార్డులను పరిశీలించారు.

ఘనంగా ఏకో నారాయణస్వామి తిరునాళ్ళ


ఏకోనారాయణ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన, తదితరులు

బొల్లాపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో ఏకో నారాయణ స్వామి తిరునాళ్ళ ఘనంగా జరిగాయి. తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారికి మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో నాలుగు భారీ విద్యుత్ ప్రభలు, వాటిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తిచేయాలి

● శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తిచేసి లబ్ధిదారులందరికీ పారదర్శకంగా పథకాలు అందేలా సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వీవోఏలు కృషి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ-4, ఈ-శ్రమ సర్వేలు, శక్తియాప్‌లపై గురువారం సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 11 సచివాలయాల పరిధిలో పీ-4 సర్వేని నూరుశాతం పూర్తి చేశామన్నారు. ఈవోపీఆర్డీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పీ4 సర్వే పూర్తయిన లబ్ధిదారులతో సర్టిఫికెట్‌లను డౌన్‌లోడ్ చేయించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఈ శ్రమ పథకంలో భాగస్వాములను చేసి వారితో సర్టిఫికెట్‌లను డౌన్‌లోడ్ చేయించాలన్నారు. మహిళలు రక్షణ కోసం రూపొందించిన శక్తియాప్‌పై అవగాహన కల్పించి మొబైల్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు భారతి, ఈవోపీఆర్డీ సుగుణ, ఏపీఎం వాసుబాబు, శావల్యాపురం సీజీజీబీ మేనేజర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోట్లూరు సర్పంచ్ తీరుపై ఎంపీడీవోకు ఫిర్యాదు

శావల్యాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పోపూరి జ్యోతి గ్రామపాలనను గాలికి వదిలేసి అధికారపార్టీ నాయకులు అభివృద్ధికి అడ్డుపడుతున్నారంటూ నిందలు మోపడం దుర్మార్గమైన చర్యని టీడీపీ నాయకులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను గురువారం కలసి పోట్లూరు సర్పంచ్ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశారు. పోట్లూరులో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రజలకు మౌలిక వసతులు కరువయ్యాయని తాము పత్రికాముఖంగా పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళామని, ఈ నెల 18వ తేదీన పోట్లూరులో వివిధ అభివృద్ధి పనులను నిర్వహించేందుకు పంచాయతీ తీర్మానం కూడా చేశారని, అలాంటిది తాము అభివృద్ధికి అడ్డుపడుతున్నామంటూ సర్పంచ్ పత్రికల్లో కథనాలు రాయించడం ఏమిటని ఎంపీడీవోతో ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ ఇతరులపై నిందలు మోపడం మానేసి గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

వేధించి కేసులు పెడుతున్నారు

● వైసీపీ స్టేట్ లీగల్ సెల్ అడ్వయిజర్ పొన్నవోలు

చిలకలూరిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి పాలనలో రాజకీయ అరాచకాలు పెరిగిపోయాయని, న్యాయ చరిత్రలో ఇవి చీకటి రోజులని వైసీపీ స్టేట్ లీగల్ సెల్ అడ్వయిజర్, ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి బుధవారం రాత్రి అన్నారు. మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ చిలకలూరిపేటలో మాజీమంత్రి, బీసీ మహిళ అయిన విడదల రజినిపై కూటమి ప్రభుత్వం వేధించి కేసులు పెట్టడం సరికాదన్నారు. చట్టానికి అతీతంగా పనిచేసే పోలీసులను ఎవర్నీ వదలమని న్యాయస్థానం ముందు కచ్చితంగా నిలబెడతామని హెచ్చరించారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త రాకేష్ గాంధీ కత్తితో బెదిరించాడని చిలకలూరిపేట పోలీసులు కేసు పెట్టారని, కానీ అతడు ఆ సమయంలో గుంటూరులో సెలూన్ షాప్‌లో ఉన్నాడని పేర్కొన్నారు. ఈ వీడియో ఫుటేజి న్యాయమూర్తికి సమర్పించడం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్తని అరెస్టు చేయటం వారిపై అనేక కేసులు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, రాజ్యహింసను ప్రోత్సహిస్తున్నదని అన్నారు. పోలీసులు అధికార పార్టీ చేతుల్లో కీలుబొమ్మలా ఆడుతున్నారని ఆరోపించారు.

కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల వాగ్వాదం

చిలకలూరిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మునిసిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం వాడిగా వేడిగా జరిగింది. పలు అంశాలపై జరిగిన చర్చలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశానికి ఛైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. నరసరావుపేట రోడ్డులో ఉన్న మాజీమంత్రి విడదల రజిని నివాసం నిర్మాణం సందర్భంగా మురుగు కాల్వల ప్రవాహాన్ని మార్చి నిర్మించారని, ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ప్రస్తావించిన టౌన్ ప్లానింగ్ అధికారులలో చలనం లేదని టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు సమావేశంలో విమర్శించారు. ఈ విషయంపై చర్యలు తీసుకునేముందు పట్టణంలోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వైసీపీకి చెందిన వలేటి లక్ష్మీనారాయణ, యూసుఫ్ ఆలీలు కోరారు. పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్‌లో కోటప్పకొండకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేరు పెట్టాలన్న అంశాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు వివరణ ఇస్తూ త్రికోటేశ్వరస్వామి ద్వారం అనే పేరును తొలగించడం లేదని, కుడి వైపున మాత్రమే ప్రత్తిపాటి పుల్లారావు పేరును చేర్చటానికి ఎజెండాలో అంశాన్ని పొందుపరిచారని వెల్లడించారు. ఎజెండాలో ఉన్న 42 అంశాలను ఆమోదిస్తూ తీర్మానించారు.

రెండున్నర ఎకరాల పొగాకు పంట దహనం

వేల్పూరు (శావల్యాపురం) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రెండున్నర ఎకరాలలో సాగుచేసిన పొగాకు పంట దహనమైన సంఘటన మండలంలోని వేల్పూరు గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మేడిబోయిన వెంకటేశ్వర్లు అలియాస్ కొండలు వేల్పూరు నుంచి గోగులపాడు వెళ్ళే మార్గంలో 4ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు పంటను సాగుచేశాడు. ఇటీవల పొగాకుకోసి పొలంలో బేళ్లు కట్టారు. గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి పొగాకు బేళ్ళకు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. ఆ మార్గంలో వెళుతున్న రైతులు చూసి బాధితుడు వెంకటేశ్వర్లుకు తెలియజేశారు. ఆ సమయంలో వినుకొండలో ఉన్న వెంకటేశ్వర్లు విషయాన్ని తన బంధువులకు చెప్పి పొలం వద్దకు పంపించాడు. వారు పొలం వద్దకు వచ్చేలోపే మూడు ఎకరాల్లోని పొగాకు బేళ్ళు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. కాలిపోయిన పొగాకు సుమారు 20క్వింటాళ్ళు ఉంటుందని, సుమారు రూ.3లక్షల వరకు పంట నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. విషయాన్ని స్థానిక పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.


చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు బహుమతి అందచేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, పక్కన స్పీకర్, ఉప ముఖ్యమంత్రి తదితరులు

ఆకట్టుకున్న జీవీ ఆంజనేయులు నటన

వినుకొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ప్రభుత్వం చేపట్టిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నటన ఆకట్టుకుంది. గురువారం ప్రదర్శించిన ఇదీ సంగతి హాస్యనాటకంలో జీవీ ఆంజనేయులు నటనను ఎమ్మెల్యేలు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు ప్రశంసించారు.


ఆందోళనలో పాల్గొన్న మునిసిపల్ పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల ఆందోళన

నరసరావుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో మునిసిపల్ కార్మికులు విధులు బహిష్కరించి మునిసిపల్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. పనిచేసినన్ని రోజులకు వేతనాలు ఇవ్వాలని అడిగి కార్మికులతో దురుసుగా వ్యవహరించిన మునిసిపల్ కమిషనర్ వైఖరికి నిరసనగా ఆందోళన నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సిలార్ మసూద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సాల్మన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు, సమాధానం, ఇంద్రయ్య, జె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగలో చేపట్టిన అభివృద్ధి పనులపై తనిఖీలు

శావల్యాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన అభివృద్ధి పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ సౌరాజు, ఏఈలు రమేష్, శర్మ, సత్యనారాయణలు పాల్గొని మండలంలోని వేల్పూరు, వెలమావారిపాలెం, పోట్లూరు, ఇర్లపాడు, కొత్తలూరు, శావల్యాపురం, కనమర్లపూడి గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులను తనిఖీ చేశారు.

యోగా థెరపీలో దేవీప్రసన్నకు గోల్డ్‌మెడల్


వైస్‌చాన్సలర్ గొల్లపల్లి కృష్ణమూర్తి నుంచి గోల్డ్ మెడల్‌అందుకుంటున్న దేవీప్రసన్న

వినుకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన దేవీప్రసన్న తిరుపతిలోని సెంట్రల్ యూనివర్శిటీ విద్యాపీఠంలో ఎంఎస్ యోగా థెరపీలో గోల్డ్ మెడల్ సాధించింది. 2023-24 సంవత్సరానికి గాను తిరుపతిలోని మహతి ఆడిటోరియంలోని 4వ వార్షికోత్సవం సందర్భంగా వైస్ చాన్సలర్ గొల్లపల్లి కృష్ణమూర్తి నుంచి ఈ గోల్డ్‌మెడల్‌ను అందుకున్నారు. దేవీ ప్రసన్న న్యాయవాది ఎంవీ అప్పారావు, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె.


వైద్యశాలకు బీరువా బహూకరిస్తున్న మానవ సేవా సమితి సభ్యులు

వైద్యశాలకు బీరువా వితరణ

వినుకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌పీ కాలనీలోని ప్రైమరీహెల్త్ సెంటర్‌కు త్వరలో న్యాక్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో మౌలిక వసతుల్లో భాగంగా మానవసేవా సమితి సభ్యులైన ఎస్ఎస్‌వీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత మస్తాన్ వైద్యశాలకు గురువారం బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పర్వీన్‌కు సోమవారం బీరువా తాళాలు అందించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు పీవీ సురేష్ మాట్లాడుతూ శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ స్ఫూర్తితో దాతల సహాయ సహకారాలతో ఆసుపత్రికి అవసరమైన వస్తువులను అందించామన్నారు.


సాధించిన ట్రోఫీతో సాఫ్ట్‌బాల్ విజేత జట్టు

సాఫ్ట్‌బాల్ విజేత ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల జట్టు

ఈపూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల క్రీడాకారులు సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు గురువారం తెలిపారు. ఈ నెల 18, 19 తేదీలలో ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల చౌడవరంలో జరిగిన అంతర కళాశాలల పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. విజేతలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, సీహెచ్ అరవింద్, ఎం.దాసు, కే వంశీ చైతన్యలు అభినందించారు.

అధికారుల కుర్చీల్లో కాంట్రాక్టర్లు


ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో యూడీసీ కుర్చీలో కూర్చున్న కాంట్రాక్టర్ కావూరి మాబుల

వినుకొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల కుర్చీల్లో కాంట్రాక్టర్లు కూర్చోవటం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజాప్రతినిధులు ఏకంగా అధికారుల కుర్చీలపై కూర్చోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. వినుకొండ పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో శావల్యాపురం మండలానికి చెంది ఓ ప్రజాప్రతినిధి కావూరి మాబుల ఏకంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో యూడీసీ బి.శేషగిరిరావు కుర్చీపై అధికారిలా గురువారం కూర్చున్నాడు. ప్రజాప్రతినిధులకు ఎదురుచెప్పలేని అధికారులు తమ కుర్చీల వెనుకవైపున దయచేసి కార్యాలయ సిబ్బందికి సంబంధించిన కుర్చీల్లో ఇతరులు ఎవరూ కూర్చోరాదని నోటీసులను అంటించారే కానీ అది అమలుకాకపోవటం చర్చనీయాంశమైంది. ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.